ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



భక్తిశ్రద్ధలతో తొలిఏకాదశి

❖ కోటప్పకొండలో భక్తుల కోలాహలం ❖ ఘనంగా స్వామివార్లకు అభిషేకాలు.. పూజలు

బాపట్ల, వేమూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు ఆదివారం జిల్లావ్యాప్తంగా అత్యంత వైభవంగా జరిగాయి. పండుగను పురస్కరించుకుని వివిధ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేసిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు స్వామివార్లకు వివిధ రకాల అభిషేకాలు చేశారు. బాపట్లలో చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయం తొలిఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. పిట్టలవానిపాలెం మండలం చందోలులో వేంచేసియున్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేమూరు మండలం జంపని చెన్నకేశవ రామేశ్వర ఆలయాల్లో ఆలయ ఉత్సవం నిర్వహించారు. తొలిఏకాదశి సందర్భంగా శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. త్రికోటేశ్వరునికి పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు.



వేమూరు మండలం జంపని చెన్నకేశవాలయంలో మహా హారతి సమర్పిస్తున్న అర్చకులు

కోటప్పకొండలో...



● పాలాభిషేకం



● పసుపుతో..



● కుంకుమతో..



● విభూదితో..



● స్వామికి ప్రత్యేక అలంకారం



నిండు కుండలా శ్రీశైలం జలాశయం

కృష్ణమ్మ పరవళ్లు

● రెండు రోజుల్లో నిండనున్న శ్రీశైలం

● సాగర్‌కు 56,674, శ్రీశైలానికి 1.34 లక్షల క్యూసెక్కులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నదీ పరివాహక ఎగువ రాష్ట్రాల్లో వర్షాలతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఎగువ ప్రాజెక్టుల గేట్లను ఎత్తి దిగువనకు భారీగా నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో శ్రీశైలం జలాశయం దిశగా వరద పోటెత్తుతోంది. డ్యాంకు 1.34 లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో జలకళ సంతరించుకుంది. రెండు రోజుల్లో శ్రీశైలం గేట్లు తెరిచి నీటిని విడుదల చేసేందుకు జలవనరుల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే నీటి మట్టం 879 అడుగులకు చేరింది. విద్యుత్ ఉత్పత్తి ద్వారా నాగార్జున సాగర్ జలాశయానికి 67,399 క్యూసెక్కులు విడు దల చేస్తున్నారు. సాగర్‌కు ఆదివారం 56,674 క్యూసెక్కుల వరద ప్రవాహం ఉంది. సాగర్‌లో నీటి నిల్వ గంటగంటకు గణనీయంగా పెరుగుతోంది. వారం రోజుల్లో సాగర్ నీటి మట్టం 13 అడుగుల మేర పెరిగింది. సాగర్ పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా ప్రస్తుతం 162 టీఎంసీలకు చేరింది. దీంతో సాగర్ కుడి కాల్వ అయకట్టులో పంటల సాగుకు అన్నదాతలు సమా యత్తమవుతున్నారు.

ఇంజనీరింగ్ ప్రవేశాలకు నోటిఫికేషన్

• నేటి నుంచి ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్లు

• 13 నుంచి 18 వరకు వెబ్ కౌన్సెలింగ్

గుంటూరు(విద్య), జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలలు, ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశం కోసం సాంకేతిక విద్యాశాఖ ఆదివారం నోటిఫికేషన్ జారీ చేసింది. విద్యార్థులు 7 నుంచి 16వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు చేసుకుని కౌన్సెలింగ్ కోసం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 17 వరకు విద్యార్థులు అప్లోడ్ చేసిన సర్టిఫికెట్లు ఆన్‌లైన్లో పరిశీలన జరగనున్నది. 13 నుంచి 18వ తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్ ఇచ్చుకునే అవకాశం ఇచ్చారు. వెబ్ ఆప్షన్లు మార్చుకునే అవకాశాన్ని ఈ నెల 19వ తేదీకి కేటాయించారు. విద్యార్థులకు ఈ నెల 22న సీట్లు కేటాయిస్తారు. అనంతరం వారు 23న తమకు సీట్లు వచ్చిన కళాశాలల్లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని నోటిఫికేషన్లో అధికారులు స్పష్టం చేశారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇది పరిస్థితి

ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఈ ఏడాది ఏపీఈఏపీ సెట్‌కు 33,063 మంది విద్యార్థులు హాజరయ్యారు. గత నెల 8న విడుద లైన ఫలితాల్లో 23,536 మంది అర్హత సాధించారు. సాం కేతిక విద్యాశాఖ విడుదల చేసిన జాబితాలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని రెండు ప్రభుత్వ యూనివర్సిటీలు (ఏఎన్‌యూ, జేఎన్టీ యూ నరసరావుపేట), 34 ఇంజనీరింగ్ కళాశాలల్లో 32,240 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అంటే దాదాపు 6,700 సీట్లు అదనంగా ఉన్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కళాశాల లో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతాయా లేదా అని వేచి చూడాలి.

మత్తుతో యువత నిర్వీర్యం

• మార్పు తెచ్చేందుకు కార్యక్రమాలు

• గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికడతాం

• అవగాహన సదస్సులో ఈగల్ వింగ్ హెడ్, ఐజీ ఆకే రవికృష్ణ



ప్రసంగిస్తున్న ఈగల్ వింగ్ హెడ్ ఐజీ ఆకే రవికృష్ణ

గుంటూరు(తూర్పు), జూలై 6 (ఆంధ్రజ్యోతి): నల్లమందు, గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాలకు యువత బానిసలవుతు న్నారని ఈగల్ వింగ్ హెడ్, ఐజీ ఆకే రవికృష్ణ తెలిపారు. 'డ్రగ్స్ నివారణ- యువతకు అవగాహన' అనే అంశం పై స్థానిక బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. మత్తులోనే ఎక్కువ నేరాలు జరుగుతున్నాయన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే వారు కూడా మత్తుకు బానిసలుగా మారడం దురదృష్టకర మ న్నారు. నిషేధిత మత్తు పదార్థాలను, మాదక ద్రవ్యాలను విని యోగించినా, రవాణా చేసినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చ రించారు. మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర కోశాధికారి రామచంద్రరాజు మాట్లాడుతూ ఈగల్ వింగ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలో అన్ని విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మట్టుపల్లి మోహన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మత్తుకు బానిస అవుతున్న వారిలో పురుషుల కన్నా మహిళలు అధికంగా ఉండటం దురదృష్టకరమన్నారు. పిల్లల ప్రవర్తన, అలవాట్లపై తల్లిదండ్రులు నిరంతరం గమనించాల న్నారు. మత్తు నుంచి బయటకు రావడం కష్టమని, దీనిని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించా రు. మాస్టర్ మైండ్స్ విద్యార్థులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని రవికృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఈగల్ పోలీస్ వింగ్ ఎస్పీ నగేష్‌బాబు, డీఎస్పీ అరవింద్, తెనాలి రెడ్ క్రాస్ చైర్మన్ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

32 చెరువులు రూ.92.29 కోట్లు

• అమృత్ 2.0 పథకం కింద నిధులు

• మునిసిపాలిటీల్లోని చెరువుల ఆధునికీకరణ • టెండర్లకు ఆహ్వానం..

రెండు నెలల్లో పనులు !



నరసరావుపేటలో ఎంపిక చేసిన కత్తవ చెరువు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పురపాలక సంఘాల్లోని చెరువులకు మహర్దశ పట్టనుంది. భూగర్భ జలాలు పెంపునకు చెరువులను ఆధునీకీకరించనున్నారు. అమృత్ 2.0 పథకం కింద ఈ పనులు చేపడుతున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాలిటీల్లో 32 చెరువులను అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు రూ.92.29 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు టెండర్ల ప్రక్రియను పబ్లిక్ హెల్త్ శాఖ నిర్వహిస్తోంది. ఈ నెల 21న టెండర్ల ప్రక్రియ ముగియనుంది.

గుంటూరు కార్పొరేషన్ సహా మునిసిపాలిటీల్లో చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. పూడికతో రూపురేఖలు కోల్పోయాయి. ఈ నేపథ్యంలో పట్టణాల్లో భూగర్భ జలాలను పెంపొందించడమే.. అమృత్ పథకం లక్ష్యం. దీని కోసం చెరువుల అభివృద్ధికి ప్రణాళికలను రూపొందించారు. ఇప్పటికే సర్వే చేయించి చెరువుల హద్దులను నిర్ణయించారు. అలాగే ఆక్రమణలను గుర్తించి, వాటిని తొలగించేందుకు చర్యలు చేపడుతు న్నారు. పల్నాడు జిల్లాలో 13 చెరువులను రూ.32.72 కోట్లు, గుంటూరు జిల్లాలో కార్పొరేషన్ సహా 12 చెరువులు రూ.45.38 కోట్లు, బాపట్ల జిల్లాలో7 చెరువులను రూ.14.10 కోట్ల వ్యవయంతో అభివృద్ధి చేయనున్నారు.

అభివృద్ధి ఇలా..

ఆధునికీకరణకు ఎంపిక చేసిన చెరువులకు హద్దులు నిర్ణయిస్తారు. చెరువుల స్థలంలో ఉన్న ఆక్రమణలు తొలగిస్తారు. పూడిక తీసి, కట్టల ను పటిష్ట పరుస్తారు. రాతితో రిటైనింగ్ వాల్ నిర్మిస్తారు. కట్టలపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి, చెరువు వైపు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తారు. పౌరులు నడిచేందుకు వీలుగా కట్టలను అభివృద్ధి చేస్తారు. సంబంధిత పనుల టెండర్ ఈ నెల 21న ముగియనుంది. రెండు నెలల వ్యవధిలో పనులు చేపట్టేందుకు పబ్లిక్ హెల్త్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

నిధుల మంజూరు ఇలా..

మునిసిపాల్టీ	చెరువులు	నిధులు
పల్నాడు జిల్లా :		రూ కోట్లలో
• నరసరావుపేట	1	5.60
• చిలకలూరిపేట	5	3.68
• మాచర్ల	1	6.60
• పిడుగురాళ్ల	1	11.52
• సత్తెనపల్లి	1	0.72
• దాచేపల్లి	2	2.50
• గురజాల	2	2.10
గుంటూరు జిల్లా :		
• గుంటూరు	2	17.80
• మంగళగిరి, తాడేపల్లి	7	11.70
• పొన్నూరు	1	3.04
• తెనాలి	2	10.34
బాపట్ల జిల్లా :		
• చీరాల	2	3.05
• బాపట్ల	1	1.94
• రేపల్లె	3	4.10
• అద్దంకి	1	5.10

ఎంపీటీఎం ఘనంగా నిర్వహించాలి

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి



బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 10న మెగాపేరెంట్ అండ్ టీచర్ మీటింగ్(ఎంపీటీఎం) 2.0, అమ్మపేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. పిల్లల విద్య, ఆరోగ్య పురోగతిపై అవగాహన కల్పించడంతోపాటు పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వాములుగా చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమన్నారు. పిల్లల సామర్థ్యాలు, ప్రవర్తన, నడవడిక తదితర అంశాలను తల్లిదండ్రులకు తెలియజేస్తూ నేరుగా వారితో మాట్లాడడం కోసం ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థకు ప్రాణం పోసే, తల్లిదండ్రుల భాగస్వామ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జిల్లా అటవీశాఖాధికారులు సూచించిన విధంగా ఎంఈవోలు నర్సరీల నుంచి మొక్కలను నిర్దేశించినట్లు పాఠశాలలకు సరఫరా చేయాలన్నారు.

తాగునీటి అవసరాలకే నీటి విడుదల

బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని చెరువులను నింపేందుకు పీటీ చానల్‌కు నీరు విడుదల చేసినట్లు ఇరిగేషన్ డీఈఈ షేక్.జకీర్అహ్మద్ తెలిపారు. బాపట్లలోని సమ్మర్‌స్టోరేజి ట్యాంక్ నుంచి తుమ్మలపల్లి వరకు నీటి సరఫరాను ఏఈ వెంకటరమణ, నీటి సంఘాల నాయకులతో కలిసి ఆదివారం డీఈఈ పరిశీలించారు. రైతులు తొందరపడి కాల్వలో నీటిని సాగు నీటి అవసరాలకు వినియోగించుకోరాదన్నారు. చెరువులు నింపిన వెంటనే సరఫరా నిలిపివేస్తామన్నారు. ఇందుకు రైతులు సహకరించాలని కోరారు.



పీటీ చానల్‌లో ప్రవహిస్తున్న నీరు

కొనుగోళ్లకు.. కొర్రీలు

● పొగాకు కేంద్రాల్లో మందకొడిగా సేకరణ

● నాలుగు జిల్లాల్లో 1952.50 ఎంటీల కొనుగోళ్లు

● ప్రభుత్వం రూ.270 కోట్లు విడుదల చేసినా పెరగని వేగం

● తేమ శాతం అధికంగా ఉందని ధరలో కోతతో రైతుల్లో ఆగ్రహం

● మంత్రి అచ్చెన్నాయుడు ఉన్నత స్థాయిలో సమీక్షించాలని కోరుతున్న రైతులు

గుంటూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి): కొనుగోళ్లలో ఉదారంగా ఉండాలి.. నిధులకు ఇబ్బంది లేదు.. రైతులు ఎక్కడా నష్టపోకూడదు. సాగుదారులందరూ సంతృప్తి చెందాలి.. అని ప్రభుత్వం పొగాకు కొనుగోళ్లకు సంబంధించి ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రభుత్వం సూచించినట్లుగా.. రైతులు ఆశించినంతగా బర్లీ పొగాకు కొనుగోళ్లు జరగడంలేదు. పొగాకు సేకరిస్తున్న ఏపీ మార్క్‌ఫెడ్, ఏఎంసీలు, డీసీఎంఎస్‌ల సిబ్బంది ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం లేదు. ఎక్కడికక్కడ కొర్రీలతో సక్రమంగా కొనుగోళ్లు చేపట్టడం లేదు. ఈ కారణంగానే దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించ లేదన్న చందంగా బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాలో పొగాకు కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. కొనుగోలు కేంద్రాలు తెరిచి ప్రాంతాన్ని బట్టి 20 నుంచి నెల రోజులు కావొస్తున్నా ఇంకా 10 శాతం కొనుగోళ్లు మా త్రమే జరిగాయి. ఏఎంసీ చిలకలూరిపేటలో చాలా తక్కువగా 73.22 మెట్రిక్ టన్నుల పొగాకు మాత్రమే ఇప్పటివరకు కొనుగోలు జరిగింది. ఇదే విధంగా ఏఎంసీ పంగులూరు, ఎస్‌డబ్ల్యూసీ పర్చూరులోనూ కొనుగోళ్ల వేగం పెరగడం లేదు. నాలుగు జిల్లాల పరిధిలో మొత్తం 11 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా ఇప్పటి వరకు కేవలం 21,367 బేళ్లు తీసుకురాగా 1952.50 మెట్రిక్ టన్నుల పొగాకు కొనుగోలు (మిగతా 7వ పేజీలో)



పర్చూరు మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం

సంక్షేమానికి.. నిబంధనలు

● నిబంధనలతో అనర్హులుగా లబ్ధిదారులు

● పలు పథకాలు కోల్పోయి బాధితులు గగ్గోలు

● అమలుకు నోచుకోని 'షరతులు లేని సంక్షేమం' హామీ

● కొనసాగుతోన్న గత వైసీపీ ప్రభుత్వ సిక్స్‌స్టెప్ వడపోత

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

నిబంధనలకు మించి ఆస్తి ఉందని.. విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటిందని.. కుటుంబంలో ఉద్యోగులు ఉన్నారని.. గతంలో ఎప్పుడో ఐటీ దాఖలు చేశారని.. ఇలా రకరకాల కారణాలతో సంక్షేమ పథకాలకు పలువురు దూరమయ్యారు. ఉండేందుకు ఇల్లు లేకపోయినా అధికారుల తప్పుగా వివరాల నమోదుతో మరికొందరు ఇటీవల తల్లికి వందనం అందుకోలేకపోయారు. గుంటూరులో ఓ కుటుంబానికి నివాసం ఉండేందుకు సరైన ఇల్లు లేకపోయినా వారి పేరుతో 15 విద్యుత్ మీటర్లు ఉన్నాయని తల్లికి వందనం పథకానికి అనర్హులు చేశారు. ఇదే పరిస్థితి గత వైసీపీ ప్రభుత్వంలో కొనసాగింది. సిక్స్‌స్టెప్ వడపోత పేరుతో పలువురు పథకాలకు దూరమయ్యారు. ఈ పరిస్థితుల్లో కూటమి నేతలు చెప్పినట్లుగా షరతులు లేని సంక్షేమం అమలు కాలేదు. లబ్దిదారులు సంక్షేమ పథకాలు వస్తాయని ఆశించిన వారు ఇటీవల విడుదలైన తల్లికి వందనం అందుకోలేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగానే ఈ ప్రభుత్వంలో కూడా వడపోత, ఏరివేత కార్యక్రమం కొనసాగుతుండడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం సంక్షేమ పథకాల భారాన్ని తగ్గించుకోవడానికి నిబంధనల వడపోతకు శ్రీకారం చుట్టి పలువుర్ని అనర్హులను చేసింది. ప్రత్యేకించి ప్రత్యర్థి పార్టీలకు చెందిన కార్యకర్తలే టార్గెట్‌గా అప్పటి అధికార పక్షం ఈ విధానాలను అమలు చేసింది. దీంతో వారంతా కూటమి ప్రభుత్వం రాకకోసం ఎంతగానో ఎదురు చూశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా అలాంటివారికి ఏమాత్రం ఊరట లభించలేదు. గత వైసీపీ ప్రభుత్వం నవరత్నాల పేరుతో హడావుడి చేసి ఆ తర్వాత సంక్షేమ పథకాల భారాన్ని తగ్గించుకునేందుకు సిక్స్‌స్టెప్ వెరిఫికేషన్‌ను అమలు చేసింది. దీంతో ఎందరో సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. దీంతో ఆ ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురి కావాల్సి వచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం కూడా అవే విధానాలను ఇప్పుడు కొనసాగించడం విశేషం. ఎన్నికల ప్రచారంలో షరతులు లేని సంక్షేమాన్ని అందిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ ఇచ్చిన మాట పక్కకు పెట్టి గత వైసీపీ ప్రభుత్వం చేపట్టినట్లుగానే నిబంధనలు అమలు చేస్తుండటంతో కూటమి శ్రేణుల్లోనూ ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. షరతులు లేని సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నీళ్లు వదలడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది.

తప్పులు సరి చేయకుండానే..

గత వైసీపీ ప్రభుత్వ బాధితుల్లో ప్రధానంగా పింఛన్లు, తల్లికి వందనం కోల్పోయి నవారే ఎక్కువగా ఉన్నారు. వారంతా కూటమి ప్రభుత్వంలో మేలు జరుగుతుందని ఆశించారు. గత ప్రభుత్వ తప్పులను సరి చేస్తుంది.. పథకాలు అందుతాయని ఎదురుచూశారు. కానీ కూటమి ప్రభుత్వం వాటిని సరిదిద్దకపోగా, కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించలేదు. పైగా అవే విధానాలను కొనసాగిస్తోంది. త్వరలో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయనున్న నేపథ్యంలో తమకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చూడాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది.



రాజకీయ లబ్ధి కోసమే

వైసీపీ తప్పుడు ఆరోపణలు

● యాదృచ్ఛిక ఘటనను మాపై రుద్దాలని కుట్రలు

● నాగమల్లేశ్వరరావు చనిపోవాలని కోరుకుంటున్న వైసీపీ

● పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

ఉగ్రవాదుల చెరలో మాచర్ల వాసి

● మాలిలో ముగ్గురు భారతీయుల కిడ్నాప్

విచారణకు హాజరైన వైసీపీ నేతలు

7

దిక్సూచి

ఎస్‌బీఐలో ప్రొబేషనరీ ఆఫీసర్లు

ఖాళీలు 541

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 541 ప్రొబేషనరీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎస్సీ: 80, ఎస్టీ: 73, ఓబీసీ: 135, ఈడబ్ల్యూఎస్: 50, యూఆర్: 203

అర్హత: గ్రాడ్యుయేషన్. ఫైనలియర్ విద్యార్థులూ దరఖాస్తు చేయొచ్చు. అయితే 2025 సెప్టెంబర్ 30వ తేదీ లోగా డిగ్రీ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. మెడిసిన్, ఇంజనీరింగ్, సీఏ తదితర విద్యార్థులూ అర్హులే.

వయస్సు: 2025 ఏప్రిల్ 1 తేదీ నాటికి వయస్సు 21 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్ అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

చివరి తేదీ: 2025 జూలై 14

వెబ్‌సైట్: https://sbi.co.in/

State Bank of India

బ్యాంకింగ్ ఉద్యోగాలు

ప్రొబేషనరీ ఆఫీసర్/ మేనేజ్‌మెంట్ ట్రైనీ

ఖాళీలు 5208



ప్రొబేషనరీ ఆఫీసర్లు/ మేనేజ్‌మెంట్ ట్రైనీల కోసం ఐబీపీఎస్ (ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్) నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 11 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో దాదాపు 5208 పోస్టులు ఉన్నాయి.

అర్హత: గ్రాడ్యుయేషన్

వయస్సు: 2025 జూలై 1 తేదీ నాటికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్ అనుసరించి వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.

బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, కెనరా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, యూకో బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాల కోసం ఈ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నారు.

చివరి తేదీ: 2025 జూలై 21

వెబ్‌సైట్: https://www.ibps.in/

Institute of Banking Personnel Selection

స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీలు 1007

పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల్లో 1007 స్పెషలిస్ట్ ఆఫీసర్ల రిక్రూట్‌మెంట్ కోసం ఐబీపీఎస్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఐబీపీఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: పోస్టులను అనుసరించి బీఎస్సీ, బీటెక్, ఎల్ఎల్‌బీ, ఎంఏ, ఎంఆర్క్, ఎంఈ/ఎంటెక్, ఎంబీఏ/పీజీడీఎం, పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయస్సు: 2025 జూలై 1 తేదీ నాటికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 జూలై 21

వెబ్‌సైట్: https://www.ibps.in/

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ జాబ్స్

మల్టీ టాస్కింగ్ స్టాఫ్(నాన్ టెక్నికల్)

పోస్టులు 1075

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ మల్టీ టాస్కింగ్ స్టాఫ్(నాన్ టెక్నికల్), హవల్దార్(సీబీఐసీ అండ్ సీబీఎన్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 1075 పోస్టులు ఉన్నాయి. పదో తరగతి పాసైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 27 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లలను అనుసరించి గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. శారీర సామర్థ్యం, రాత పరీక్షల ఆధారంగా ఎంపిక ఉంటుంది.

చివరి తేదీ: 2025 జూలై 24 **వెబ్‌సైట్:** ssc.gov.in

జూనియర్ ఇంజనీర్లు

పోస్టులు 1340

వివిధ డిపార్ట్‌మెంట్లలో ఖాళీగా ఉన్న 1340 జూనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీ కోసం ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంజనీరింగ్ డిప్లొమా, గ్రాడ్యుయేషన్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఖాళీల్లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రిల్ ఇంజనీర్ల పోస్టులు ఉన్నాయి(డిపార్ట్‌మెంట్ వారీగా ఖాళీల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు). **వయస్సు:** పోస్టులను బట్టి కొన్నింటికి 30, మరికొన్నింటికి 32 సంవత్సరాలు గరిష్ఠ వయోపరిమితి ఉంది. **చివరి తేదీ:** 2025 జూలై 22

వెబ్‌సైట్: ssc.gov.in/

కోర్ బ్రాంచెస్‌లో కీలకం మెకానికల్ ఇంజనీరింగ్

కోర్ ఇంజనీరింగ్‌లో ప్రధానమైన వాటిలో మెకానికల్ ఒకటి. యాంత్రీకరణతో కలిగిన ప్రయోజనాలు ఎన్నో. మానవ నాగరికతలో అది చెప్పుకోదగ్గ మైలురాయి. యంత్రం ఎలా పనిచేస్తుందో తెలియాలంటే మెకానికల్ ఇంజనీరింగ్‌పై అవగాహన ఉండాలి. ఈ డిసిప్లిన్‌పై అవగాహనకు తోడు అధ్యయనంతో వచ్చే ఉద్యోగాలు, కెరీర్ పరంగా ఎదుగుదల ఎలా ఉంటుందో చూద్దాం.



కదలిక ఉన్న పరికరాల డిజైన్, అభివృద్ధి, ఏర్పాటు, నిర్వహణ, మరమ్మతులు సహా సమస్తం మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి వస్తాయి. రోజువారి జీవితం ఈ సబ్జెక్టుతో ముడిపడి ఉంది. బహుళ అంతస్తుల భవనం మొదలుకుని డ్రైవ్ చేసే వాహనం వరకు మెకానికల్ ఇంజనీరింగ్ ఉనికికి ఉదాహరణలే. ప్రాబ్లమ్ సాల్వింగ్ కూడా ఇందులో భాగం. సైన్స్ మేథ్స్ ఉపయోగించి మెకానికల్ ఇంజనీర్లు పలు సమస్యలకు పరిష్కారాన్ని కనుగొంటారు. ఫీల్డ్‌లో ఎదురయ్యే సమస్యలకు టెక్నాలజీ అడ్వాన్స్‌మెంట్‌తో మంచి పరిష్కారం చూపిస్తారు. అందుకే మెకానికల్ ఇంజనీర్లు బయోమెడికల్, మాన్యుఫాక్చరింగ్, కన్‌స్ట్రక్షన్, ఆటోమేటివ్ రంగాల్లో ఉపాధిని పొందగలుగుతున్నారు.

వివిధ బ్రాంచ్‌లు

మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకి పలు బ్రాంచీలు వస్తాయి. ఆడిటివ్ మాన్యుఫాక్చరింగ్, అడ్వాన్స్‌డ్ మెకట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఆటోమేషన్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్, ఆటోమొబైల్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్, ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ఆటోమేటివ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ, మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, మెకానికల్ అండ్ ఆటోమేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ మెకట్రానిక్స్ ఇంజనీరింగ్(ఆడిటివ్ మాన్యుఫాక్చరింగ్), మెకానికల్ అండ్ రైల్ ఇంజనీరింగ్, మెకానికల్ అండ్ స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్(ఆటోమొబైల్), మెకానికల్ ఇంజనీరింగ్(ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్), మెకానికల్ ఇంజనీరింగ్(మాన్యుఫాక్చరింగ్ ఇంజనీరింగ్), మెకానికల్ ఇంజనీరింగ్(ప్రొడక్షన్), మెకానికల్ ఇంజనీరింగ్(వెల్డింగ్ టెక్నాలజీ), మెకానికల్ ఇంజనీరింగ్ ఆటోమొబైల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిజైన్, మెకట్రానిక్స్ ఇంజనీరింగ్, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్, ఆటోమేటివ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, ఆటోమొబైల్ సర్వీసింగ్ వంటివన్నీ మెకానికల్ ఇంజనీరింగ్ పరిధిలోకే వస్తాయి.

కెరీర్ అవకాశాలు

కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్: పెద్ద పెద్ద నిర్మాణాల్లో కూడా మెకానికల్ ఇంజనీర్ అవసరం ఉంటుంది. వెంటిలేషన్, కూలింగ్, హీటింగ్ వంటి పనులు అక్కడ ఉండేవారికి ఎలాంటి అపాయం కలుగని రీతిలో ఉండేందుకు మెకానికల్ ఇంజనీర్ల సూచనలు, సలహాలు అవసరం.

ఆటోమేటివ్ ఇంజనీర్: ఆటోమోటివ్ ఇండస్ట్రీలో వివిధ వాహనాల ఉత్పత్తి, డిజైనింగ్‌లో వీరి సేవలు అవసరం. ఇందులో మళ్ళీ కస్టమర్, మిలిటరీ వాహనాలంటూ ప్రత్యేకంగానూ ఉంటాయి. సురక్షితంగా కొత్త ఫీచర్లు, ప్రత్యామ్నాయ ఇంధనాలు, ఏరోడైనమిక్స్ తదితరాల్లో మెకానికల్ ఇంజనీర్ల పాత్ర ఉంటుంది.

రోబోటిక్ ఇంజనీర్: రోబోటిక్స్ నిర్మాణం, ప్లాన్, నిర్వహణలో పాలుపంచుకోవాలి. డిజైన్, టెక్నాలజీకి తోడు హెల్త్‌కేర్, మెడికల్ డివైజ్‌ల కోసం రోబోట్లను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు.

ప్రాసెస్ ఇంజనీర్: తార్కికంగా ఆలోచించడం, సరికొత్తగా చేయాలన్న ఆలోచన - అమలుపై ఆసక్తి ఉన్న మెకానికల్ ఇంజనీర్లు బీటెక్ తరవాత ప్రాసెస్ ఇంజనీరింగ్‌ను ఎంచుకోవాలి. సంబంధిత విధానాల మెరుగుదలలో ప్రాసెస్ ఇంజనీర్ల పాత్ర ఇతోధికంగా ఉంటుంది. వాటర్ అండ్ పవర్ సప్లయ్, ఫార్మాస్యూటికల్స్, డ్రగ్ మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీలో వీరి అవసరం చాలా ఉంటుంది.

మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్: వస్తువుల ఉత్పత్తికి అవసరమైన మెషీన్ల డిజైనింగ్ మాన్యుఫాక్చరింగ్ ఇంజనీర్ పరిధిలోకి వస్తుంది. మెషీన్ విభాగాలు వేటినైనా వీరే రూపొందిస్తారు. అప్లయిన్సెస్ నుంచి ఫుడ్ వరకు వాటికి అవసరమైన పరికరాలను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది.

ప్రాజెక్ట్ మేనేజర్: వివిధ పనులను ప్రాజెక్టులుగా మలిచి టీమ్‌లను సదరు సంస్థలు నియమిస్తాయి. వారందరితో సక్రమంగా పనిచేయిస్తేనే సదరు ప్రాజెక్ట్ పని పూర్తవుతుంది. ప్రాజెక్టుకు మేనేజర్‌గా అనుభవం బాగా ఉన్న వ్యక్తులను నియమిస్తారు. తమ టీమ్‌లోని సభ్యులతో సమర్థంగా పనిచేయించడమే కాదు, ఫలితాలను రాబట్టే పనిని వీరు చేయాల్సి ఉంటుంది.

సర్వీస్ అండ్ మెయింటెనెన్స్ ఇంజనీర్: కస్టమర్ బిల్డింగ్‌లో వీరుంటారు. యంత్రాలు సమర్థంగా, నిరంతరాయంగా పని చేసే విషయంలో నిమగ్నమై ఉంటారు. క్లయింట్ విజిట్స్, మెషీన్ల చెకింగ్, పనికిరానివాటిని తొలగించి కొత్తవాటిని ఉంచడం వంటి పనులు ఉంటాయి.

మెటీరియల్స్ ఇంజనీర్: వివిధ యంత్రాల ఉత్పత్తిలో మెటీరియల్ సేకరణ, పరీక్షించడం, మోడిఫై, ఎవాల్యుయేషన్ పనులు ఉంటాయి.

కంట్రోల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీర్: ఫ్యాక్టరీ లేదంటే పనిచేసే చోట పరిశోధన, డిజైన్, డెవలప్‌మెంట్, సిస్టమ్స్ ఇన్‌స్టలేషన్ పనులు ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ పక్కాగా జరిగేలా చూడాల్సిన బాధ్యత వీరిదే.

ప్రొఫెసర్స్, లెక్చరర్స్: మెకానికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ లేదంటే యూజీసీ నెట్/ సీఎస్ఐఆర్ ఎగ్జామ్‌లో క్వాలిఫై అయితే ఇంజనీరింగ్ విద్యా సంస్థల్లో బోధకులుగా రాణించవచ్చు. అంటే అకడమిక్ వాతావరణంలో ఉండొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలు: యూపీఎస్సీ నిర్వహించే ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామ్ రాసి ఎంపికైతే ఆరంభంలోనే మంచి జీతం, అధికారిక హోదా తద్వారా సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను నిర్మించుకోవచ్చు. ప్రభుత్వంలో నీటిపారుదల వ్యవస్థలు మొదలుకుని పలు ఇతర విభాగాల్లో మెకానికల్ ఇంజనీర్లు అవసరమవుతారు.

ఆంత్రప్రెన్యూర్‌షిప్: బాస్‌గా మారడం అన్నమాట. సొంతంగా పైకి ఎదగాలన్న ఆకాంక్ష ఉంటే అందుకు సొంత ఆలోచనలు తోడైతే ఇండిపెండెంట్‌గా యూనిట్ పెట్టుకోవచ్చు. ఒకరి కింద పనిచేయాల్సిన అవసరం ఉండదు. తానే మరికొందరికి ఉపాధి కల్పించవచ్చు.



ప్రొ. ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

ప్రయోజనాలు

మనిషి దైనందిన జీవితంతో ముడిపడినది మెకానికల్ ఇంజనీరింగ్. అందులో భాగంగా వివిధ పరిశ్రమల్లో తలెత్తే సమస్యల పరిష్కారంలో మెకానికల్ ఇంజనీర్లు విశిష్ట పాత్రను పోషిస్తారు. మెషీన్స్‌కు సంబంధించి మాన్యుఫాక్చరింగ్, డిజైనింగ్, మెయింటెనెన్స్, అనాలిసిస్ కాన్సెప్టులు బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులో భాగం. ఈ నాలుగేళ్ళ కోర్సు మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఉజ్వల కెరీర్‌కు రహదారిని నిర్మిస్తుంది. మేథ్స్, ఫిజిక్స్, ఇంజనీరింగ్ గ్రాఫిక్స్, థియరీ ఆఫ్ మెకానిక్స్, మెషీన్ డ్రాయింగ్, కంప్యూటర్ గ్రాఫిక్స్ తదితరాలు కోర్సులో ఉంటాయి. మాన్యుఫాక్చరింగ్, రీసెర్చ్, డిజైన్ ఎక్విప్‌మెంట్‌కు సంబంధించి నైపుణ్యాల పెంపునకు పై అంశాల అధ్యయనం ఉపయోగపడుతుంది. సంబంధిత నైపుణ్యాలకు పదునుపెట్టుకోవడం ద్వారా మాత్రమే ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశం లభిస్తుంది.

చిత్రజ్యోతి

SINCE 1965

యాక్షన్ థ్రిల్లర్



'సప్త సాగరాలు దాటి' చిత్రంతో చక్కని గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు హేమంత్‌రావు. ఆయన తెరకెక్కిస్తున్న తాజా చిత్రం '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో డాలీ ధనంజయ కథానాయకుడు. శివరాజ్‌కుమార్ కీలకపాత్ర పోషిస్తున్నారు. వైశాఖ్‌గౌడ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ మొదలైంది. ఈ సందర్భంగా డాలీ ధనంజయ లుక్‌ను యూనిట్ విడుదల చేసింది. యాక్షన్‌తో పాటు ప్రేక్షకులను అలరించే అన్ని హంగులతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం, త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం అని మేకర్స్ తెలిపారు. పాన్ ఇండియా కంటెంట్‌తో రూపొందుతున్న చిత్రమిదని దర్శకుడు అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్‌రాజ్, సినిమాటోగ్రఫీ: అద్వైత

కంటెంట్ ఉంటేనే కలెక్షన్లు

\- ఎస్‌కేఎన్



'ప్రస్తుతం సినిమాల్లో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్న ఏకైక అంశం మంచి కంటెంట్ మాత్రమే. సినిమా చిన్నదైనా, పెద్దదైనా ముందు కథ బావుండాలి. ప్రేక్షకుల అభిరుచి మారింది. ఎంత హంగామా చేసినా సినిమాలో కంటెంట్ లేకుంటే థియేటర్లకు రావడం లేదు. మంచి కథతో వచ్చిన సినిమాలే బాక్సాఫీసు దగ్గర నిలబడుతున్నాయి' అని నిర్మాత ఎస్‌కేఎన్ అన్నారు. ఆయన నిర్మిస్తున్న పలు చిత్రాల విశేషాలను ఆదివారం మీడియాతో పంచుకున్నారు.

● నిర్మాతను అవ్వాలని నేను ఇండస్ట్రీకి రాలేదు. అవకాశం వచ్చింది. అందిపుచ్చుకున్నాను. ఇప్పుడు హిందీలోనూ సినిమాలు చేస్తున్నాను. నిర్మాతగా నెగ్గుకు రావడం అంత సులభం కాదు. మన కష్టం అంతా ఒక్కరోజులో పోవచ్చు. పది రూపాయలు పెడితే ఇరవై రూపాయలు వస్తుందని నిర్మాణ రంగంలోకి అడుగుపెడితే నష్టపోతాం. ముందు ఈ రంగం పట్ల మక్కువ ఉండాలి.

● ప్రస్తుతం 'రాజాసాబ్' బ్యాలెన్స్ షూట్ పూర్తి చేసే పనిలో ఉన్నాం. కిరణ్ అబ్బవరంతో 'చెన్నై లవ్‌స్టోరీ' చేస్తున్నా. హిందీలో 'బేబీ' చిత్రం రీమేక్ చేస్తున్నాం. ఆగస్టులో చిత్రీకరణ మొదలుపెడతాం. దర్శకుడు మారుతి, సాయిరాజేశ్‌తో కూడా మా బేనర్‌లో సినిమాలు చేస్తున్నాం. ఇద్దరు కొత్త దర్శకులతో సినిమాలు చేయబోతున్నాం.

● నిర్మాతగా తక్కువ బడ్జెట్‌లో మంచి కథలతో సినిమాలు చేయడం, అవి ప్రేక్షకాదరణ పొందడం నాకు సంతోషాన్నిచ్చింది. ప్రస్తుతం పలు అగ్ర నిర్మాణ సంస్థలతో కలసి సినిమాలు నిర్మిస్తున్నాను. ఇప్పటివరకూ కొందరు తెలుగమ్మాయిలను నా సినిమాల ద్వారా కథానాయికలుగా పరిచయం చేశాను. మరో ముగ్గురు తెలుగమ్మాయిలను పరిచయం చేయబోతున్నా. అలాగే మహిళా దర్శకులతోనూ సినిమాలు చేసేందుకు ప్లాన్ చేస్తున్నా.

తెలుగువారంటే వైల్డ్ ఫైర్

అమెరికాలో టాలీవుడ్ సినీ తారలు సందడి చేశారు. 'నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్)- 2025' వేడుకలో దర్శకులు రాఘవేంద్రరావు, సుకుమార్, హీరో అల్లు అర్జున్, హీరోయిన్ శ్రీలీల తదితరులు పాల్గొన్నారు.



తెలుగువారంటే ఫైర్ అనుకున్నారా... వైల్డ్ ఫైర్ అంటూ తన 'పుష్ప' చిత్రంలోని డైలాగ్‌తో ప్రసంగాన్ని ప్రారంభించిన అల్లు అర్జున్ సభికులను అలరించారు. 'ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు ఎంతో సంతోషిస్తున్నా. ఇంతమంది తెలుగువారిని చూస్తుంటే హైదరాబాద్‌లోనో విశాఖపట్నంలోనో ఉన్నట్లు అనిపిస్తోంది. అమెరికాలో మనమంతా ఇలా కలవడం అదృష్టంగా భావిస్తున్నా. నన్ను ఇలాంటి అద్భుతమైన కార్యక్రమానికి ఆహ్వానించినందుకు నాట్స్‌కు ధన్యవాదాలు. నాట్స్ గురించి సరదాగా 'పుష్ప' స్టయిల్‌లో చెప్పాలంటే 'నాట్స్ అంటే నేషనల్ అనుకుంటివా... ఇంటర్నేషనల్'. మన తెలుగు సంస్కృతిని ముందు తరాలకు చేరవేస్తున్నందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. భారతీయులు ఎక్కడున్నా తగ్గేదేలే...అందులోనూ తెలుగోళ్లు అస్సలు తగ్గేదేలే. విదేశాల్లోనూ తెలుగువారు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు' అని అల్లు అర్జున్ అన్నారు.

● దర్శకుడు రాఘవేంద్రరావు మాట్లాడుతూ 'నేను పరిచయం చేసిన బన్నీ, శ్రీలీల ఇక్కడ ఉన్నందుకు ఆనందంగా ఉంది. సుకుమార్‌కూ నాకూ ఒక పోలిక ఉంది. అదే గడ్డం. నేను 'అడవి రాముడు'లో అడవిని నమ్ముకున్నా. స్టార్ డైరెక్టర్‌ను అయ్యా. 'పుష్ప'లో అడవిని నమ్ముకున్న సుకుమార్ స్టార్ డైరెక్టర్ అయ్యారు. బన్నీని స్టార్ హీరోను చేశారు. శ్రీలీల సైతం దెబ్బలు పడతాయని అంటూ అందరినీ అలరిస్తోంది' అని అన్నారు.


నాకొక గుర్తింపును ఇచ్చారు

\- సమంత



'నేను ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా, ఏ పరిశ్రమలో పనిచేసినా ..తెలుగు ప్రేక్షకులు నన్ను చూసి గర్వపడాలని భావిస్తాను. ఇన్నేళ్ల ప్రయాణంలో నాకు మద్దతుగా నిలిచినందుకు ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాను. మీరంతా నాకంటూ ఒక గుర్తింపునూ, కుటుంబాన్నీ ఇచ్చారు' అంటూ భావోద్వేగానికి గురయ్యారు నటి సమంత. అమెరికాలో జరుగుతున్న తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) వేడుకల్లో పాల్గొన్నారు సమంత. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ' తానా వేడుకల్లో పాల్గొనడానికి నాకు 15 ఏళ్లు పట్టిందంటే నమ్మలేకపోతున్నా. ప్రతి ఏటా ఇక్కడ జరిగే వేడుకలు, తెలుగువారి గురించి వింటూనే ఉన్నాను. నా తొలి చిత్రం 'ఏ మాయ చేసావే' నుంచి నన్ను మీ మనిషిలా భావించారు. నాపై ప్రేమను చూపించారు. మీ ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు చెప్పడానికి నాకు ఇన్నేళ్లు పట్టింది. కెరీర్ పరంగా ముఖ్యమైన దశలో ఉన్నాను. ట్రాలాలా పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించాను. నిర్మాతగా 'శుభం'తో తొలి అడుగు వేశా. నార్త్ అమెరికాకు చెందిన తెలుగువారు నా చిత్రాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు' అని అన్నారు.

గ్యాంగ్‌స్టర్ డ్రామా



రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కుతోన్న భారీ చిత్రం 'దురంధర్'. సంజయ్‌దత్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాతో సారా అర్జున్ కథానాయికగా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు. గతంలో పలు విజయవంతమైన చిత్రాలను అందించిన ఆదిత్య ధర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. డిసెంబరు 5న ప్రపంచ వ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్, టీజర్‌ని చిత్రబృందం రిలీజ్ చేసింది. ట్రైలర్‌ని చూస్తే ఇదొక గ్యాంగ్‌స్టర్ డ్రామా అని అర్థమవుతోంది. ఇటీవల వచ్చిన 'కిల్', 'జాన్ విక్'లను మించిన యాక్షన్ సన్నివేశాలు ఇందులో ఉన్నాయి.

కొత్తగా..

వినోదం పంచే బకాసుర



నటుడు ప్రవీణ్ ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. వైవా హర్ష టైటిల్ రోల్ పోషిస్తున్నారు. ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌తో ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. లక్ష్మయ్య ఆచారి, జనార్థన్ ఆచారి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా టైటిల్ ర్యాప్‌సాంగ్‌ను దర్శకుడు అనిల్ రావిపూడి చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. ఈ గీతాన్ని వికాస్ బడిస స్వరపరిచారు. ఈ సందర్భంగా ఎస్‌జే శివ మాట్లాడుతూ "బకాసుర రెస్టారెంట్‌లో ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు వినోదం పంచడంతో పాటు థ్రిల్‌ను ఇస్తుంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: బాల సరస్వతి, ఎడిటర్: మార్తాండ్ కే. వెంకటేశ్

ప్రేక్షకులను మెప్పించే ప్రేమకథ



సుహాస్ కథానాయకుడిగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓ భామ అయ్యో రామ'. మలయాళ నటి మాళవికా మనోజ్ కథానాయికగా పరిచయమవుతున్నారు. రామ్‌జీ దర్శకుడు. హరీశ్ నల్ల నిర్మిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు హరీశ్ శంకర్ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఈనెల 11న 'ఓ భామ అయ్యోరామ' విడుదలవుతోంది. ఇటీవలె నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'సుహాస్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో తెరకెక్కిన చిత్రమిది. చక్కని ప్రేమకథతో రూపొందించాం. ప్రతి సన్నివేశం ప్రేక్షకులను అలరిస్తుంది. కొత్త అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ 'సినిమా మేకింగ్‌లో రాజీ పడలేదు. మంచి అవుట్‌పుట్ వచ్చింది. పాటలు, ఆకట్టుకునే రొమాంటిక్ సన్నివేశాలు, అందరినీ కట్టిపడేసే భావోద్వేగాలు ఈ చిత్రంలో మిళితమై ఉన్నాయి' అని చెప్పారు.

అన్ని హంగులతో అలరించేందుకు



యూత్‌ఫుల్ సబ్జెక్ట్‌తో తెరకెక్కిన చిత్రం వర్జిన్‌బాయ్స్. మిత్రశర్మ, గీతానంద్, శ్రీహాన్, రోనిత్ ప్రధాన తారాగణం. దయానంద్ గడ్డం దర్శకత్వంలో రాజా దారపునేని నిర్మించారు. ఈనెల 11న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సినిమా టికెట్లు కొన్నవారిలో లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసిన 11 మందికి ఐఫోన్లు బహుమతిగా ఇస్తామని చిత్రబృందం తెలిపింది. దర్శకుడు దయానంద్ మాట్లాడుతూ 'నా కళాశాల అనుభవాలను ఆధారంగా చేసుకొని తెరకెక్కించిన చిత్రమిది. 'వర్జిన్‌బాయ్స్' అనే టైటిల్‌కు కచ్చితంగా సరిపోయేలా కథ ఉంటుంది' అని చెప్పారు. రాజా దారపునేని మాట్లాడుతూ 'ఈ సినిమాలో పాపులర్ నటీనటులు ఎవరూ లేరు. కథే ఈ చిత్రానికి హీరో. ప్రేక్షకులను అబ్బురపరిచే కంటెంట్‌తో వస్తున్నాం' అని తెలిపారు. గీతానంద్ మాట్లాడుతూ 'ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లి ఎంటర్‌టైన్ చేస్తుంది. మంచి సినిమా చూసిన ఫీల్‌తో ప్రేక్షకులు థియేటర్ నుంచి వెళ్తారు' అని అన్నారు.

మిస్టీరియస్ కథతో...



పాతతరం నటుడు నాగభూషణం మనవడు అబిద్ భూషణ్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'మిస్టీరియస్'. మహి కోమటిరెడ్డి దర్శకత్వంలో ఉషా, శివాని నిర్మించారు. రోహిత్ సహాని కీలకపాత్ర పోషిస్తున్నారు. రియాకపూర్, మేఘనా రాజ్‌పుత్ కథానాయికలు. ఇటీవలె నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా మహి కోమటిరెడ్డి మాట్లాడుతూ 'సస్పెన్స్ జానర్‌లో వస్తున్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్క్రీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అన్నారు. భారీ బడ్జెట్, హై టెక్నికల్ వాల్యూస్‌తో గ్రాండియర్‌గా నిర్మించిన చిత్రమిది, భవిష్యత్‌లో మరిన్ని మంచి చిత్రాలతో ప్రేక్షకుల ముందుకొస్తామని నిర్మాతలు తెలిపారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు (విద్య) జూలై 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ సీవీ రేణుక ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు, జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయాల ద్వారా ప్రతిపాదనలను ఈ నెల 13లోగా పంపాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం నేషనల్ అవార్డ్స్ టు టీచర్స్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

ఎరువుల కొరత రానివ్వొద్దు

● డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు

గుంటూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగు నేపథ్యంలో జిల్లాలో రైతులకు ఎక్కడా ఎరువుల కొరత రానివ్వకుండా చూసుకోవాలని గుంటూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు సూచించారు. గుంటూరు కోర్టు రోడ్డులోనున్న డీసీఎంఎస్ కార్యాలయంలో ఆదివారం ఉమ్మడి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ హరిబాబు, పక్కన బీఎం హరిగోపాలం

జిల్లా బ్రాంచ్‌ల ఇన్‌చార్జీలు, ఉద్యోగులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని రైతులకు సకా లంలో ఎరువులు అందజేస్తూ ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. ఎట్టి పరిస్థితు ల్లోనూ సొసైటీ నిర్వహించే వ్యాపారాల్లో అవినీతిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గత దారిలో ఎవరైనా.. ఉంటే వెంటనే ప్రవర్తన మార్చుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. బ్రాంచ్‌లలో ఖచ్చితంగా పురోగతి రావాలని ఆదేశించారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ఉండబోతుందన్నారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ హరిగోపాలం, ఇస్కో జిల్లా మేనేజర్ రఘు సురేంద్ర, మేనేజర్ శ్రీనివాసరావు తదితరులున్నారు.

రైస్ మిల్లుపై దాడి.. పీడీఎస్ బియ్యం గుర్తింపు



పట్టుబడిన పీడీఎస్ రైస్ నిల్వల వద్ద డీఎస్పీ భానూదయ, తహసీల్దార్ క్షమారాణి, సీఐ రమా నాయక్ తదితరులు

వట్టిచెరుకూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : అనంతవరప్పాడు గ్రామంలోని శ్రీవల్లి రైస్ మిల్లులో భారీ ఎత్తున పీడీఎస్ నిల్వలు ఉన్నట్లు ఆదివారం అధికారులు గుర్తించారు. అద్దె ప్రాతిపదికన గుంటూరుకు చెందిన వ్యక్తులు ఈ మిల్లును నిర్వహిస్తున్నారు. మిల్లుకు గుంటూరు నుంచి పెద్దఎత్తున పీడీఎస్ బియ్యం చేరినట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌కు సమాచారం అందడంతో.. సౌత్ జోన్ డీఎస్పీ భానూదయ అప్రమత్తమయ్యారు. ఆమె మఫ్టీలో మిల్లు ఆవరణలోకి చేరుకొని వట్టిచెరుకూరు సీఐ రమానాయక్, తహసీల్దార్ క్షమారాణి, సీఎస్ డీటీ శివ శంకర్‌కు సమాచారం అందించారు. అనంతరం మిల్లులో ఉన్న బియ్యం నిల్వలను అధికారులు పరిశీలించారు. పీడీఎస్ బియ్యం భారీగా ఉన్నట్లు గుర్తించారు. 70 టన్నులకు పైగా నిల్వలు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తి వివరాలను సోమవారం వెల్లడిస్తామని తహసీల్దార్ క్షమారాణి, సీఎస్ డీటీ శివశంకర్ వెల్లడించారు.

రాజకీయ లబ్ధి కోసమే వైసీపీ తప్పుడు ఆరోపణలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

- యాదృచ్ఛిక ఘటనను మాపై రుద్దాలని కుట్రలు
- నాగమల్లేశ్వరరావు చనిపోవాలని కోరుకుంటున్న వైసీపీ
- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

గుంటూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): పొన్నూరు నియోజకవర్గం మన్నవ గ్రామంలో జరిగిన యాదృచ్ఛికమైన, ఊహించని ఘటనను అడ్డం పెట్టుకొని రాజకీయ లబ్ధి పొందేందుకు వైసీపీ ఆరోపణలు చేయడం సిగ్గుచేటని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. గుంటూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. నాగమల్లేశ్వరరావుపై దాడి జరిగిన టీ స్టాల్ ప్రదేశం వైసీపీకి చెందిన వారిదేనన్నారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన ఐదుగురు కార్యకర్తలు ఘటనా స్థలంలో ఎందుకు ఉన్నారో పోలీసులు దర్యాప్తు చేయాలన్నారు. సీసీ టీవీ ఫుటేజీలో గొల్ల చౌదరితో పాటు మరో ఇద్దరు కూడా కనిపిస్తున్నారని చెప్పారు. ఈ ఘటనలో వాస్తవాలను దాచిపెట్టి కేవలం టీడీపీకి చెందిన వారే ఉన్నారని పోలీసులకు సమాచారం ఎవరిచ్చారని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఘటన జరిగాక అంబులెన్స్‌ను కాదని ఆటోలో.. వైసీపీ నాయకురాలు ఆసుపత్రికి ఎందుకు తీసుకువెళ్లారన్నారు. వైసీపీ నాయకులు నీచస్థాయికి దిగజారుతున్నారనేదానికి ఈ ఘటనే ఉదాహరణ అని పేర్కొన్నారు. అంబటి సోదరులతో పాటు, వైసీపీలోని పలువురు నేతల ఆరోపణలు చూస్తే ఏదో విధంగా టీడీపీ నేతలను ఈ ఘటనలో ఇరికించాలని, ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయాలన్న కుట్ర కనిపిస్తోందన్నారు. 25 ఏళ్ల శాసనసభ సభ్యుడిగా తన ప్రయాణంలో పొన్నూరు నియోజకవర్గంలో రాజకీయ కక్షలు తగ్గిపోయాయని, వైసీపీ ఎమ్మెల్యే గెలిచిన నాటి నుంచి అరాచకాలు పెరిగిపోయాయన్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ అక్రమాలకు ఎదురు నిలిచినందుకు టీడీపీ నేత బండ్లమూడి బాబురావు కుటుంబంపై 9 కేసులు, అదే మన్నవ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలపై 20 కేసులు నమోదు చేశారని గుర్తుచేశారు. పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, అప్పిరెడ్డి, అంబటి రాంబాబు, అంబటి మురళి వంటి మేధావులంతా... కలిసి చికిత్స పొందుతున్న నాగమల్లేశ్వరరావుకు మెరుగైన వైద్యం అందకుండా చేసి, అతను చనిపోయేలా చేయడం ద్వారా అల్లర్లు సృష్టించాలన్న కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో దాసరి రాజా మాస్టారు, కసుకుర్తి హనుమంతరావు, కంచర్ల శివరామయ్య, బొల్లెద్దుల సుశీలరావు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల చెరలో మాచర్ల వాసి

- మాలిలో ముగ్గురు భారతీయుల కిడ్నాప్
- బాధితుల్లో ఒకరు ఏపీకి చెందిన అమరలింగేశ్వరరావు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కుటుంబ సభ్యుల విజ్ఞప్తి
- తామే కిడ్నాప్ చేశామని ప్రకటించిన జేఏఎన్‌ఐఎం

మాచర్లటౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఆఫ్రికా దేశమైన మాలిలో ఉగ్రవాదులు పంజా విసిరారు. అక్కడ డైమండ్ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ముగ్గురు భారతీయులను అపహరించారు. వారిలో పల్నాడు జిల్లాలోని మాచర్ల మండలం జమ్మలమడక గ్రామానికి చెందిన కూరాకుల అమరలింగేశ్వరరావు ఉన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్‌లో నివసిస్తున్న ఆయన కుటుంబం అమరలింగేశ్వరరావును సురక్షితంగా విడిపించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ విషయంపై కిషన్‌రెడ్డి తక్షణమే స్పందించి.. మాలిలోని భారత రాయబార కార్యాలయం అధికారులతో మాట్లాడారు. బాధితులను విడిపించేందుకు వేగంగా చర్యలు చేపట్టాలని కేంద్ర విదేశాంగ శాఖకు లేఖ కూడా రాశారు. అమరలింగేశ్వరరావు 11 ఏళ్లుగా మాలిలోని డైమండ్ సిమెంట్ ఫ్యాక్టరీలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. హైదరాబాద్ కొండాపూరులోని ప్రసాదిత్య కంపెనీ ద్వారా ఆయన అక్కడకు వెళ్లారు. అతనితో పాటు కిడ్నాప్‌కు గురైన వారిలో ఒడిశాకు చెందిన పి.వెంకటరమణ, రాజస్థాన్‌కు చెందిన ప్రసాద్ ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల ఒకటిన బైకులపై వచ్చిన సాయుధ మిలిటెంట్లు సిమెంట్ ఫ్యాక్టరీలోకి చొరబడి ముగ్గురిని అపహరించుకుపోయారు. ఈ కిడ్నాప్ వెనుక తమ హస్తముందని అల్‌ఖైదా అనుబంధ సంస్థ జమా త్ నుస్రత్ అల్ ఇస్లాం వాల్ ముస్లిమిన్ (జేఏఎన్‌ఐఎం) ప్రకటించింది. ఈ ఘటన జరిగి ఆరు రోజులు గడిచినా ఉగ్రవాదుల నుంచి ఎలాంటి డిమాండ్‌లు రాలేదు. ఒడిశాకు చెందిన వెంకటరమణను కాపాడాలని మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కేంద్ర విదేశాంగ మంత్రి జయశంకర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలుస్తోంది. తమ కుమారుడిని సురక్షితంగా రక్షించి స్వదేశానికి తీసుకురావాలని అమరలింగేశ్వరరావు తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి భారత ప్రభుత్వాన్ని వేడుకొంటున్నారు. కాగా, మాచర్ల రూరల్ పోలీసులు వారిని కలిసి తాజా పరిణామాలను విచారించారు.



అమరలింగేశ్వరరావు తల్లిదండ్రుల నుంచి సమాచారం సేకరిస్తున్న మాచర్ల పోలీసు

కొనుగోళ్లకు.. కొర్రీలు

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఇందుకు సంబంధించి రైతులకు రూ.17.09 కోట్లు చెల్లింపులు జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సంబంధిత అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సమీక్షించాలని రైతులు కోరుతున్నారు.

రైతులపై భారం..

ప్రభుత్వం రూ.270 కోట్లు విడుదల చేసినా ప్రొక్యూర్‌మెంట్ వ్యవస్థలు స్పీడు పెంచడంలేదు. బర్లీ పొగాకు సాగు చేసి కొనుగోళ్లు జరగక రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం సాయం కోరింది. కేంద్రం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. దేశంలో ఎక్కడా ఎప్పుడూ లేనట్లుగా రాష్ట్ర ప్రభుత్వమే గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేసి పొగాకు కొనుగోళ్లు చేపట్టింది. మొత్తం 11 కేంద్రాలను ఏర్పాటు చేసి పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఏ తేదీన సరుకు తీసుకురావాలనే దానిపై అధికారులు షెడ్యూల్ ఇచ్చారు. సాంకేతిక కారణాలతో పొగాకు కొనుగోలు కేంద్రాల్లో వేగవంతంగా ప్రాసెసింగ్ జరగడం లేదు. 20 శాతం వరకు తేమని అనుమతిస్తామని అధికారులు చెప్పారు. అయితే ఏ రైతు పొగాకు తీసుకొచ్చినా తేమ శాతం అధికంగా ఉందని ధరలో కోత పెడుతున్నారు. హైక్వాలిటీకి క్వింటాల్ రూ.12 వేలు, మీడియం క్వాలిటీకి రూ.9 వేలు, లోగ్రేడ్ రకానికి రూ.6 వేలు చెల్లిస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు. ఇప్పుడు రైతులు మీడియం క్వాలిటీలు తీసుకొస్తున్నా లోగ్రేడ్‌గా ముద్ర వేస్తున్నారు. కాగా పెదనందిపాడు పరిసర ప్రాంతాల్లో రైతులు దాదాపుగా 35 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుంటూరులోని సీడబ్ల్యూసీ గోడౌన్‌కు తీసుకురావడానికి వ్యయప్రయాసలు పడాల్సి వస్తున్నది. దీని వల్ల రవాణా చార్జీలు పెరిగిపోతున్నాయి. నిబంధనల ప్రకారం అన్‌లోడింగ్ చార్జీలు వసూలు చేయడానికి వీల్లేదు. అయినప్పటికీ బేలుకు రూ.130 రూ.160 వరకు వసూలు చేస్తున్నారు. ఇందుకు అధికారులు ఎలాంటి అడ్డు చెప్పడం లేదు. ఈ కారణంగానే ఈ వా రంలో రైతులు ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుని రెండుసార్లు ప్రశ్నించారు. పొగాకు రైతులు అధికసంఖ్యలో ఉన్న పెద నందిపాడులో కూడా మరో కేంద్రం ఏర్పాటు చేయాలని సాగుదారులు కోరుతున్నారు.

ఇప్పటి వరకు కొనుగోళ్లు ఇలా...

జిల్లా	సెంటర్	బేళ్ల సంఖ్య	కొనుగోళ్లు (టన్నుల్లో)	చెల్లింపు (రూ.లలో)
బాపట్ల	ఇంకొల్లు	1083	100.229	98,58,150
"	పంగులూరు	613	52.31	47,14,890
"	పర్చూరు	3863	368.11	3,60,17,250
"	టీకేపాలెం	1295	136.22	1,33,90,110
"	చీరాల	29012	281	2,27,39,430
"	పర్చూరు	786	75.78	68,86,590
గుంటూరు	గుంటూరు	2747	260.96	2,15,54,064
"	పెదకాకాని	1515	132.88	98,74,350
పల్నాడు	చిలకలూరిపేట	817	73.22	59,05,620
"	యడ్లపాడు	2443	205.04	1,68,50,070
ప్రకాశం	గుండ్లపల్లి	3303	266.7624	2,31,26,496

విద్యార్థుల భవిష్యత్తుపై సెల్‌ఫోన్ ప్రభావం

◆ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

తెనాలి అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల భవిష్యత్తుపై సెల్‌ఫోన్ తీవ్ర ప్రభావం చూపుతోందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తెనాలి ప్రాంతీయ కార్యాలయంలో జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం ఆదివారం నిర్వహించారు. పాఠశాలల్లో సెల్‌ఫోన్ లేని విధానం అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల బోధనపై కూడా సెల్‌ఫోన్ ప్రభావం పడుతుందని, రోజువారీ యాప్‌లు, సమాచారాల నివేదన, శిక్షకులతో సమయం సరిపోతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల నమ్మకంతో పంపించే విద్యార్థుల తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా ఉపాధ్యాయులు పని చేయాలని పేర్కొన్నారు. ప్రచురణ విభాగం చైర్మన్ హనుమంతరావు మాట్లాడుతూ పీటీఎం నిర్వహణలో ఫిట్‌నెస్ అధికారి ఆదేశాలు ఉపసంహరించుకోవాలన్నారు. ఆడిట్ కన్వీనర్ మల్లేశ్వరరావు, కళాదర్, దౌలా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూతన ఒరవడితో రంగస్థలాన్ని తీర్చిదిద్దాలి

❖ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి అర్బన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అధునిక సమాజంలో ఆదరణ తగ్గుతున్న రంగస్థలాన్ని నూతన ఒరవడితో తీర్చిదిద్దాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఆహ్వాన నాటిక పోటీలను ఆదివారం రెండవ రోజు జ్యోతి ప్రజ్వలన గావించి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ.. కళాకారులకు నిలయమైన తెనాలిలో రంగస్థలా న్ని ఆదరిస్తూ ప్రోత్సహిస్తున్న వారు ఎంతో మంది ఉన్నారన్నారు. కొత్తతరం రంగస్థలం పట్ల ఆసక్తి చూపేలా మార్పులు చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. విజయవాడ యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్ కళాకారులు ప్రదర్శించిన అనుకున్నదొక్కటి అయినదొక్కటి నాటిక సరదాగా సాగింది. పెళ్లైన వారికే ఇల్లు అద్దెకు ఇస్తామని చెప్పిన వారిని నమ్మించి.. అద్దెకు దిగిన బ్యాచ్‌లర్ పడిన తంటాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్యం సిద్ధించి ఏళ్లు గడుస్తున్నా పేదల స్థితిగతులు మారకపోవడం ఇతివృత్తంగా సాగిన నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. విజయవాడ న్యూ స్టార్ మోడ్రన్ థియేటర్ కళాకారులు ఈ నాటికను ప్రదర్శించారు. విశాఖపట్నం చైతన్య కళా స్రవంతి కళాకారులు అసత్యం నాటిక మంచి సందేశమిచ్చింది. రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నాటిక పోటీల్లో సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, కాకతీయ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు, ఈదర వెంకటపూర్ణచంద్, న్యాయవాది జగదీశ్వరాంబ పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి నాటిక పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి

తానా సదస్సులో డాక్టర్ కందిమళ్ల ప్రసంగం



సినీ నటుడు మురళీమోహన్ నుంచి జ్ఞాపికను అందుకుంటున్న డాక్టర్ కందిమళ్ల

చిలకలూరిపేట, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని డెట్రాయిట్‌లో మూడు రోజుల పాటు జరిగిన తానా 24వ అంతర్జాతీయ సదస్సులు ఈ నెల 5న ముగిశాయి. సాహిత్య విభాగంలో రేపటి తెలుగు నాటకం అనే అంశంపై పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు, విశ్రాంత తెలుగు ప్రొఫెసర్ డాక్టర్ కంది మళ్ల సాంబశివరావు ప్రసంగించారు. ఈ సదస్సులో సినీ నటుడు మురళీ మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన సాంబశివరావును అభినందించి, జ్ఞాపికను బహూకరించారు.

బుల్లెట్ మిస్‌ఫైర్.. జవాన్ మృతి



ఆర్మీ జవాన్ రవి (ఫైల్‌ఫొటో)

నగరం, జూలై 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిలకావారిపాలెం గ్రామానికి చెందిన ఉప్పాల రవి(24) జమ్మూకశ్మీర్‌లో ఐదేళ్లుగా జవాన్‌గా సేవలందిస్తున్నారు. శనివారం రాత్రి విధుల్లో అతను మిస్‌ఫైర్ అయిన బుల్లెట్ తగిలి మృతి చెందాడు. అధికారుల ద్వారా ఈ విషాదకర వార్త తెలుసుకున్న జవాను కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. తల్లిదండ్రులు ఇమ్మానుయేల్, సీతామహాలక్ష్మి కన్నీటిపర్యంతమయ్యారు. వీరికి ఇద్దరు కుమారులు కాగా రవి చిన్నవాడు. రవి పార్థీవదేహానికి సోమవారం స్వగ్రామంలో సైనిక లాంఛ నాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

కల్లుగీత కార్మికుడి...



పూర్ణచంద్రరావు (ఫైల్‌ఫొటో)

నిజాంపట్నం(రేపల్లె) జూలై 6(ఆంధ్రజ్యోతి): తాడిచెట్టుపై కల్లు గీస్తూ ప్రమాదవశాత్తు కిందపడి గీత కార్మికుడు కారంకి పూర్ణచంద్రరావు(56) మృతి చెందాడు. కొమరవోలు గ్రామానికి చెందిన మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభు త్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

ఫిరంగిపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేరికపూడి వద్ద రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన దాసరి శ్రీను(45) గ్రామంలోని ఈతరం పబ్లిక్ స్కూల్ బస్సుకు క్లీనర్‌గా పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం మేరికపూడి దర్గా వద్ద మొహర్రం వేడుకల కోసం శ్రీను మరో ముగ్గురు కలసి ఆటోలో వచ్చారు. తిరుగు ప్రయాణంలో వీరు ప్రయాణిస్తున్న ఆటోను.. మేరికపూడి వద్ద నరసరావుపేట వైపు నుంచి వస్తున్న దోస్త్ వ్యాన్ డ్రైవర్ ముందు వెళ్తున్న బస్సును ఓవర్ టేక్ చేయబోయి ఢీకొట్టాడు. ఆటో బోల్తా కొట్టడంతో.. డ్రైవర్‌కు, దాసరి శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. శ్రీనును వేరే ఆటోలో చికిత్స నిమిత్తం నరసరావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. డాక్టర్ పరీక్షించి మరణించినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య పద్మ, కుమార్తె ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి..



జిల్లెల రామిరెడ్డి (ఫైల్‌ఫొటో)

మాచర్లటౌన్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన మాచర్ల పట్టణంలో ఆదివారం చోటుచేసుకుంది. పట్టణంలోని నెహ్రూనగర్ 2వ లైన్‌కు చెందిన జిల్లెల రామిరెడ్డి (55) తన స్నేహితుడు వెంగళరెడ్డితో కలిసి దుర్గి మండలం అడిగొప్పుల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మ వారిని దర్శించుకుని వస్తున్నారు. చంద్రవంక బ్రిడ్జి మీదకు రాగానే వెనుక నుంచి ఆర్టీసీ బస్సు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో కింద పడిపోయిన రామిరెడ్డిపై నుంచి బస్సు వెనుక టైరు వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వెంగళరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

విచారణకు హాజరైన వైసీపీ నేతలు

సత్తెనపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రెంటపాళ్ళ పర్యటన సందర్భంగా సత్తెనపల్లి రూరల్, పట్టణ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసులకు సంబంధించి పోలీసులు 113 మంది వైసీపీ నేతలకు ఆదివారం 41ఏ నోటీసులు అందించారు. జగన్ పర్యటన సందర్భంగా ర్యాలీ, డీజే సౌండ్ ఏర్పాటు చేసి ప్రజలకు, పాఠశాలలకు, ఆస్పత్రులకు ఇబ్బంది కలిగించిన అంశంలో జూన్ 19న పోలీసులు కేసులు నమోదు చేశారు. మాజీ మంత్రులు విడదల రజిని, అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, నంబూరు శంకరరావు, బొల్లా బ్రహ్మనాయుడు, దేవినేని అవినాష్, గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి తదితరులు నిందితులుగా ఉన్నారు. నోటీసులు అందుకున్న డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి, అన్నాబత్తుని శివ కుమార్, డాక్టర్ గోపిరెడ్డి, తలశిల రఘురామ్ తదితరులు పట్టణ, రూరల్ పోలీసు స్టేషన్‌లకు హాజరై తమ వివరణ ఇచ్చారు.

భవిష్య విద్యాసంస్థల అధినేత శ్రీధర్ ఆత్మహత్య

● ఆర్థిక ఇబ్బందులే కారణం



ఇమడాబత్తిన శ్రీధర్ (ఫైల్‌ఫొటో)

సత్తెనపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక సత్తెనపల్లికి చెందిన భవిష్య విద్యాసంస్థల అధినేత ఇమడాబత్తుని శ్రీధర్ (50) శనివారం కృష్ణానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసు కున్న వన్‌టౌన్ పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్ బృందం ఆదివారం నదిలో గాలించి శ్రీధర్ మృతదేహాన్ని ఒడ్డుకు తెచ్చి.. అతని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని నాగార్జున కాలనీకి చెందిన ఇమడాబత్తుని శ్రీధర్, ఉమాకల్యాణి దంపతులు స్థానికంగా 13 ఏళ్ల నుంచి భవిష్య విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. ఇటీవల శ్రీధర్ ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నాడు. ఈ నేపథ్యంలో గత శనివారం ఉదయం 7 గంటలకు సత్తెనపల్లిలో ఉన్న సాయిబాబా గుడికి వెళ్లొస్తానని భార్యకు చెప్పి మోటార్ సైకిల్‌పై బయల్దేరాడు. ఎంతకీ శ్రీధర్ ఇంటికి రాకపోవడంతో అతని భార్య ఫోన్ చేసింది. ఫోన్ స్విచ్ఛాఫ్ అని వచ్చింది. బంధువులు, స్నేహితుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవటంతో ఉమాకల్యాణి సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ప్రకాశం బ్యారేజీ 38వ ఖానా పైనుంచి ఓ వ్యక్తి నదిలో దూకినట్లు స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్ బృందం ఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా, అక్కడ మోటార్ సైకిల్ ఉంది. ఆ నంబర్ ఆధారంగా పోలీసులు సత్తెనపల్లి పోలీసు లకు సమాచారం అందిం చా రు. అయితే, ఆదివారం మధ్యా హ్నానికి పోలీసులు, ఎస్‌డీఆర్ ఎఫ్ బృందం శ్రీధర్ మృతదే హాన్ని గుర్తించారు. మోటార్ సైకిల్ నంబర్ ఆధారంగా శ్రీధర్ కుటుంబ సభ్యులకు సమాచారం తెలియప రిచా రు. వారు విజయవాడ వచ్చి మృతదేహాన్ని శ్రీధర్‌దిగా గుర్తించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించి అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. శ్రీధర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ప్రజాసంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

● టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని


కార్యక్రమం గురించి వివరిస్తున్న పల్లం సరోజని తదితరులు

బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని తెలిపారు. మండలంలోని కొండుభొట్లపాలెం గ్రామపంచాయతీ 121వ బూత్‌లో ఆదివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీశ్రేణులతో కలిసి ఇంటింటికెళ్ళి సూపర్ సిక్స్ పథకాలతోపాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు గురించి ప్రజలకు వివరించారు. బాపట్ల పర్యాటక కేంద్రం అభివృద్ధికి రూ.97 కోట్లు, మున్సిపల్ హైస్కూల్ నిర్మాణం పూర్తి చేసేందుకు రూ.కోటి 40 లక్షలు మంజూరు చేయటం జరిగిందన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ నాయకత్వంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జి మార్పు ప్రతాప్, జి.వెంకటేష్, ముక్కంటి పాల్గొన్నారు.

కావూరులో...

చెరుకుపల్లి, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆదివారం కావూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ నేత మండవ తాతాజీ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లాలంటే కూటమిప్రభుత్వం వల్లే సాధ్యమవుతుందన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ బుల్లిబాబు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

● కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు

బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాపితంగా ఈనెల 9వ తేదీన నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఈ విషయమై ఆదివారం బాపట్లలోని ఏఐటీయూసీ కార్యాలయంలో కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశం జరిగింది. సమావేశంలో ఆయా యూనియన్‌ల నాయకులు మాట్లాడి పలు తీర్మానాలు చేశారు. 7వ తేదీ బాపట్లతోపాటు వివిధ నియోజకవర్గాల, పట్టణాలలో సైకిల్‌ర్యాలీలు నిర్వహించాలన్నారు. 9వ తేదీ ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆటోలను ఆపివేయాలని, ఉదయం 9 నుంచి ధర్నాలు, ర్యాలీలు నిర్వహించి సమ్మెను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల శామ్యూల్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు మేకల ప్రసాద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకులు దోనేపూడి రవి, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి మామిడిబత్తుల అశోక్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి కె.శరత్, గిరి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలి

● జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకుడు శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న పల్నాటి శ్రీరాములు

బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శులపై పని భారం తగ్గించాలని జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకుడు పల్నాటి శ్రీరాములు డిమాండ్ చేశారు. జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం సమావేశం ఆదివారం బాపట్ల ఎన్జీవోహోమ్‌లో నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి శ్రీరాములు మాట్లాడుతూ పారిశుధ్య పనులలో కీలక పాత్రపోషించే క్లాప్ మిత్రాలకు ఇచ్చే నెల జీతం రూ.6 వేలు చాలకపోవటంతో ఎక్కువ మంది ముందుకురావటంలేదన్నారు. ప్రస్తుతం పాత రిక్షాల స్థానంలో ఈఆటోలు, ట్రాక్టర్‌లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కార్యదర్శులు డి.మురళి బాపూజి, డి.సుజాత, మోర్ల శ్రీనివాసరావు, షేక్ జిలానీ తదితరులు పాల్గొని ప్రసంగించారు. జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ఏర్పాటు నిమిత్తం 25 మండలాల నుంచి ఒక్కొక్క ప్రతినిధిని సమావేశంలో ఎన్నుకున్నారు.

సమ్మె ఒప్పందాలు అమలు చేయాలి : సీఐటీయూ

బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు గత 17 రోజుల సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆదివారం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సమ్మె ఒప్పందాలు అమలు చేస్తుందని, వేతనాలు కొంతమేర అయినా పెరుగుతాయని మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా ఎదురు చూస్తున్నారన్నారు. కావున కార్మికులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.కొండయ్య, కె.శరత్, మురళి కృష్ణ, హరిబాబు, నాని, రత్నం, ప్రమీలా పాల్గొన్నారు.

ఘనంగా మొహరం.. పురవీధుల్లో పీర్ల ఊరేగింపు

కొల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మొహరం పండుగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. కొల్లూరులోని జెండా చెట్టు వద్ద ఉన్న పీర్ల చావిడిలో ఆదివారం పీర్లను శుభ్రపరిచి అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం పీర్లను గ్రామ పురవీధుల్లో ఊరేగించి తిరిగి చావిడి వద్దకు తీసుకువచ్చి యథాస్థానంలో ప్రతిష్ఠించారు.

ఈ కార్యక్రమంలో హిందువులు సైతం పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ప్రసాదం, పానకం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హిందూ, ముస్లింలు సోదరభావంతో పాల్గొని మతసామరస్యం చాటారు.


పీర్లను పురవీధులలో ఊరేగిస్తున్న ముస్లింలు

ఇంటింటా 'సుపరిపాలనలో తొలి అడుగు'

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు


మోపర్రులో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటా తీసుకువెళ్ళాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని మోపర్రులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం అందించిన పథకాలు, గ్రామంలో చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలన ఎలా ఉంది అనే విషయాలను ప్రజల వద్ద నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటిలో లబ్దిదారులకు ఏఏ పథకాలు అందాయి వివరాలను ట్యాబ్‌లో ఆన్‌లైన్ ద్వారా పరిశీలించారు. గ్రామంలో రూ.25 లక్షలతో అభివృద్ధి చేసిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం. త్వరలో కేంద్ర సాయంతోపాటు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు తమ ఖాతాల్లో రూ.20 వేలు 3 విడతలగా ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించనున్నట్లు తెలిపారు. రోడ్ల వ్యవస్థను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. గ్రామాల్లో వేల కోట్ల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేయడం జరిగిందన్నారు. ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయని, నిధుల కోసం కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వేమూరు మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు క్రొత్తపల్లి రవీంద్రబాబు, కొల్లిసాయి, కాంతారావు, కొడాలి సుబ్బారావు, కొడాలి నాగయ్య, షేక్ నాగమయ్య, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు బకాయిలు వెంటనే చెల్లించాలి

● యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి

బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో రిటైర్డ్ అయిన, చనిపోయిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరావు డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ బాపట్ల జిల్లా కార్యదర్శి వై.శ్రీనివాసరావు పదవీవిరమణ సందర్భంగా ఎం.ఎస్.ఆర్.కళ్యాణ మండపంలో నిర్వహించిన వీడ్కోలు సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సభలో ఆయన మాట్లాడుతూ 36 సంవత్సరాలుగా ఆర్టీసీలో కండక్టర్‌గా సేవలందించిన వై.ఎస్.రావు సేవలు అభినందనీయమన్నారు. అనంతరం వై.ఎస్.రావు దంపతులను ఘనంగా సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పసుపులేటి చిరంజీవి, అమరావతి ఛైర్మన్ సురేష్, రాష్ట్ర కోశాధికారి ఎండీ ఎ.సిద్దిక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందపాటి శంకరరావు, రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వీ కృష్ణారావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి బిటి వలి, నెల్లూరు జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు వాకా రమేష్, దాసరి బాబు శామ్యూల్, జిల్లా కార్యదర్శి విజయకుమార్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఖాజా, కార్యదర్శి తిరుపతిరావు, పి.రజనీ, సీహెచ్ చంద్రశేఖర్, వై.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులకు ఘనసన్మానం

కర్లపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం బుద్దాం ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయులు చెరుకుపల్లి ప్రభాకర్ పదవీ విరమణ చేశారు. కర్లపాలెం వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఉపాధ్యాయుడు ప్రభాకర్ దంపతులను మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా ప్రభాకర్ యూటీఎఫ్ శాఖకు విశేష సేవలందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో విజయశ్రీ, ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జె.వినయ్‌కుమార్, కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, ప్రతినిధి ఎం.వెంకటేశ్వరరెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఏడుకొండలు, వైవీ నారాయణ, వై.భాస్కరరావు, అక్రమహోరి పాల్గొన్నారు.


ప్రభాకర్ దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఉపాధ్యాయులు

జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుబ్బారావు


సుబ్బారావుకు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎలక్షన్ ఆఫీసర్ ఎం.రమేష్ తదితరులు

బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : గవర్నమెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా నిజాంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల హిందీ అధ్యాపకులు పి.సుబ్బారావును ఎన్నుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగిన అసోసియేషన్ ఎన్నికకు ఎం.రమేష్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జి.గోపాల్‌చంద్ ప్రకాష్ పరిశీలకుడిగా వ్యవహరించారు. ఉపాధ్యక్షుడిగా కె.మధుసూదనరావు, సెక్రటరీగా ఎం.అనీల్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా కేవీ సాంబశివరావు, కోశాధికారిగా జి.తులసీరేఖ, మహిళా కార్యదర్శిగా వి.భారతి, రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ఎన్‌వీ దాసును ఎన్నుకున్నారు. ఎన్నికైన వారికి ఎలక్షన్ ఆఫీసర్ నియామకపత్రాలు అందజేసి అభినందించారు.

పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు


తాగునీటి పైపులైన్ మరమ్మతులు చేయిస్తున్న కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పటేల్ నగర్ దగ్గర జీబీసీ రోడ్డు పక్కనే తాగునీటి ప్రధాన పైపులైన్‌కు లీకులు ఏర్పడ్డాయి. లీకులు గురించి తెలుసుకున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి హుటాహుటిన ఆ ప్రాంతాన్ని సందర్శించి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. లీకేజిల పనులు మొత్తం పూర్తి చేసి సరఫరాకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు.

ఘనంగా నూకాలమ్మతల్లి కొలుపులు

బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భర్తీపూడి గ్రామంలో ఉన్న నూకాలమ్మతల్లి కొలుపులను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ అచంట అమరేష్, రమేష్, శ్రీనివాసరావు, నాగరాజు, శ్రీను, సోమయ్య, నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తులకు అన్న ప్రసాద వితరణ

కర్లపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం పాత నందాయపాలెం గ్రామంలో చీరాల ఇలువేల్పు బురకాయలఅంకమ్మ తల్లి మలికొలుపులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఈసందర్భంగా గ్రామంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీరాల శ్రీనివాసరెడ్డి, చీరాల రవి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండలం జమ్ములపాలెం రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఏరియా వైద్యశాలకు తరలించారు. బాపట్ల కొత్తపాలేనికి చెందిన రామకోటేశ్వరరావుగా క్షతగాత్రుడిని గుర్తించారు.


బాపట్ల పాతబస్టాండ్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పూజలు నిర్వహిస్తున్న పండితులు, భక్తులు

వైభవంగా తొలి ఏకాదశి పూజలు

బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : బాపట్లలో ఆదివారం తొలిఏకాదశి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. చారిత్రక ప్రసిద్దిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణ స్వామి దేవాలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా పాతబస్టాండ్‌లో ఉన్న శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో తొలి ఏకాదశి పూజలను పండితులు నిర్వహించారు. భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందుకున్నారు.

పిట్టలవానిపాలెం మండలంలో...

పిట్టలవానిపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో తొలి ఏకాదశి పండుగ పురస్కరించుకొని అమ్మ వారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. మండలంలోని అన్ని దేవాలయాలలో భక్తులు ఏకాదశి పండుగ పర్వదినం సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు.

కొల్లూరు మండలంలో...

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 6 (ఆంధ్రజ్యోతి) : తొలి ఏకాదశి పర్వదినాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని వెల్లటూరు గీతా జ్ఞాన మందిరంలో శ్రీకృష్ణ భగవానునికి ఆదివారం పుష్పాలతో అష్టోత్తర శత నామ పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలుకు చెందిన గుండి పార్వతమ్మ భజన మండలి, కొల్లూరు మండలం కోటిపల్లికి చెందిన సీతారామాంజనేయ భజన మండలి, కొల్లిపరకు చెందిన సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో అర్ధ ఏకాహం హరేరామ హరేకృష్ణ భజన కార్యక్రమాలు నిర్వహించారు. వేములపల్లి వనజాక్షి పర్యవేక్షణలో జరిగిన ఆషాడ మాస పూజ కార్యక్రమాల్లో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు సీతాపతిరావు, వంగర చలమయ్య సిద్ధాంతి, క్రాప రవికుమార్ పాల్గొన్నారు.


వేమూరు మండలంలో...

వేమూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి గ్రామాల్లోని శివ, విష్ణు ఆలయాల్లో ఆదివారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తి ప్రపత్తులతో విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. జంపని చెన్నకేశవ రామేశ్వర ఆలయాలలో గౌడ కులస్తులు వార్షిక విశేష పూజలు జరిపించారు. స్వామివారల ఉత్సవమూర్తుల ద్వారా ఆలయ ఉత్సవం నిర్వహించారు. పెరవలి వేంకటేశ్వరస్వామి ఆలయం, మాధవ కేశవ ఆలయాలలో, వేమూరు రామేశ్వర ఆలయం, అబ్బనగూడవల్లిలోని శివ, విష్ణు ఆలయాలు, వేమూరు శిరిడి సాయి మందిరం, పెనుమర్రు రామాలయం, కుచ్చెళ్లపాడు రామ మందిరం, శివాలయాలలో వార్షిక ఉత్సవాలు నిర్వహించారు.

ఘనంగా శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి

బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనసంఘ్ స్థాపించి ఆధునిక హిందుత్వజాతీయ వాదాన్ని ప్రగాఢంగా విశ్వసించిన దేశభక్తుడు శ్యామప్రసాద్ ముఖర్జీ అని టీడీపీ నాయకుడు తిరువీధుల శంకరప్రసాద్ అన్నారు. పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సోషల్ వెల్ఫేర్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మైభారత్‌యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ మేరా యువభారత్, గుంటూరు వారి సౌజన్యంతో శ్యామప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ విజయలక్ష్మి అధ్యక్షత వహించి మాట్లాడుతూ న్యాయవాదిగా ఉంటూ హిందూ మహాసభ రాష్ట్రీయ స్వయంసేవక్‌సంఘ్ సభ్యుడిగా పని చేసి జనసంఘ్‌ను స్థాపించి దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని స్థాపించిన మహోన్నతమైన వ్యక్తి ముఖర్జీ అని కొనియాడారు. బీజేపీ నాయకులు ఎస్‌బీఎస్‌జీ తిలక్, డీసీవీవో పురుషోత్తంరావు, జీఎస్ ప్రియ, బడుగు కిషోర్, పి.ప్రసాదరావు, నల్లమోతు శామ్యూల్ జాన్సన్ పాల్గొని ఆయన పటానికి పుష్పాంజలి ఘటించారు.

గల్లంతైన యువకుడిని కాపాడిన పోలీసులు


గల్లంతైన యువకుడిని కాపాడి ప్రథమ చికిత్స చేస్తున్న గజఈతగాళ్ళు

బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సూర్యలంక సముద్రతీరానికి స్నేహితులతో కలిసి వచ్చి స్నానం చేస్తున్న ఓ యువకుడు అలల దాటికి గల్లంతు కాగా పోలీసులు గుర్తించి ప్రాణాలు కాపాడారు. వివరాల్లోకి వెళితే... గుంటూరు ప్రగతి నగర్‌కు చెందిన పెనుమాక ఉదయ్‌తేజ ఆదివారం స్నేహితులతో కలిసి సూర్యలంక సముద్రతీరానికి వచ్చాడు. సముద్రస్నానం చేస్తుండగా భారీ అలలు వచ్చాయి. దీంతో యువకుడు అలల్లో చిక్కి కేకలు పెడుతూ సముద్రంలోకి కొట్టుకువెళుతుండగా సూర్యలంక కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు ఏఎస్‌ఐ అద్దంకి చక్రవర్తి, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ నాగరాజు గజఈతగాళ్ళతో కలిసి వెంటనే స్పందించి యువకుడిని రక్షించి బయటకు తీసుకొచ్చారు. ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. యువకుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని మెరైన్ సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

వాహనాల తనిఖీ

కర్లపాలెం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం సెంటర్‌లో మోటారు వాహనాలను ఆదివారం ఎస్‌ఐ రవీంద్ర తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీంద్ర మాట్లాడుతూ పరిమిత వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని వాహనదారులకు తెలియజేశారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు, లైసెన్స్‌లు వెంట ఉంచుకోవాలని తెలిపారు.

అభివృద్ధికి రూ.97.18 కోట్ల ప్రతిపాదనలు

● ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే వేగేశన వినతి


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల నియోజకవర్గ అభివృద్ధి పనులకు 97.18 కోట్ల రూపాయలు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో కలిసిన ఎమ్మెల్యే పలువిషయాలు ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. నియోజకవర్గంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు గురించి వివరించి సంవత్సర పాలనలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు గురించి వివరించారు. రాబోయే రోజుల్లో బాపట్ల నియోజకవర్గంలో ఉన్న సమస్యలను వివిధ శాఖల వారీగా చేపట్టేందుకు నిధులు అవసరమని సిద్ధం చేసిన ప్రణాళికను, ప్రతిపాదనను ముఖ్యమంత్రికి అందజేశారు. పి4 కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ బాపట్ల పట్టణంలోని 1వ వార్డు బేతనీకాలనీలో సందీప్, హేమశ్రీ చిన్నారులను దత్తత తీసుకోవటంపై ముఖ్యమంత్రి అభినందించారు.

నేడు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ మండల విస్తృత స్థాయి సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆదివారం తెలిపారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరిగే సమావేశానికి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొంటారన్నారు. తొలుత రైలుపేటలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని గృహ సందర్శన చేస్తారన్నారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సూర్యతేజ మృతదేహానికి శివప్రసాద్ నివాళి


సూర్యతేజ మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న శివప్రసాద్

చెరుకుపల్లి, జూలై 6(ఆంధ్రజ్యోతి) : పొన్నూరులో కల్యాణమండపంలో గురువారం విద్యుత్ షాక్‌తో చికిత్స పొందుతూ మృతి చెందిన సూర్యతేజకి ఆదివారం తన స్వగ్రామం నడింపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. సూర్యతేజ మృతదేహాన్ని టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్ సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. మృతుని కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తాతా ఏడుకొండలు, టీడీపీ నేతలు గోగినేని వసుధ, పూషడపు కుమారస్వామి, పులికొండలు, కేసనరామకృష్ణ పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

● టీడీపీ లీగల్ సెల్ అధికార ప్రతినిధి జయప్రకాష్

వేమూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జంపని గ్రామంలో ఆదివారం భారత తొలి ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్‌రామ్ వర్ధంతిని టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ లీగల్ సెల్ అధికార ప్రతినిధి వేల్పుల జయప్రకాష్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు వట్టిప్రోలు యోబు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల రవిప్రసాద్, క్రిస్టియన్ యూత్ సభ్యులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌ను ఎత్తివేయాలి

రేపల్లె, జూలై 6(ఆంధ్రజ్యోతి) : కార్మికులకు నష్టం చేసే నాలుగులేబర్‌కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూలై 9న జరిగే సమ్మె ప్రదర్శనలో కార్మికవర్గాలు అందరూ పాల్గొని జయప్రదం చెయ్యాలని పిలుపునిచ్చారు. ఏఐటియూసీజిల్లా కౌన్సిల్‌సభ్యులు సింగం వాణి మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం నాయకురాలు ఎం.శోభారాణి, నాయకులు పి.భిక్షాలు, కోనాశ్రీను, కె.ఝాన్సీ, పి.విజయ్, కె.ఆశీర్వాదం, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ఆషాడ సారె సమర్పణ


ఆషాడ సారె సమర్పించేందుకు ఊరేగింపుగా వెళుతున్న మహిళా భక్తులు

కొల్లూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఆషాడ మాసం తొలి ఏకాదశి పురస్కరించుకుని గ్రామ దేవతలకు ఆషాడ సారె సమర్పించారు. ఆదివారం కొల్లూరులోని చింతలమ్మ, అంకమ్మ, భవానీ అమ్మవార్లకు ఆషాడ సారె సమర్పించేందుకు మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున గ్రామ పురవీధుల్లో సారెతో ఊరేగింపుగా తరలి వెళ్లి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సమర్పించారు. ఊరేగింపులో పలు వీధుల్లో మహిళా భక్తులు సారెకు నమస్కరించి కొబ్బరికాయలు కొట్టారు.


పట్టణంలోని 7వ వార్డులో ఏకలవ్య జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏకలవ్య సంఘం నాయకులు

ఏకలవ్యుని ఆశయాలు పుణికిపుచ్చుకోవాలి

రేపల్లె, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ఏకలవ్యుని ఆశయాలను ప్రతి ఒక్కరూ పుణికిపుచ్చుకుని ముందుకు వెళ్ళాలని ఏపీ ఎరుకుల ఆత్మగౌరవ సేవా సంఘం అధ్యక్షుడు మద్దుల రామకృష్ణ అన్నారు. పట్టణంలోని 7వ వార్డులో ఏకలవ్యుని జయంతి సందర్భంగా ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్‌కట్‌చేసి మిఠాయిలను పంచారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సత్వరమే ఎరుకుల వారికి ఏకలవ్య కార్పొరేషన్ చేయాల్సిందిగా కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు డేగల చినబాబు, మద్దుల అంకాలు, శీలం శ్రీరాములు, జీవీ నాగేశ్వరరావు, కుంభా తిరుపతయ్య, మద్దుల వీరాంజనేయులు, మద్దుల నాగరాజు, బొడ్డు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్టూవర్టుపురం గ్రామంలో...

బాపట్ల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని స్టూవర్టుపురం గ్రామంలో ఏకలవ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎరుకుల సేవాసంఘం రాష్ట్ర నాయకుడు భోగిరి శ్రీకాంత్, మిత్ర రాష్ట్ర కార్యదర్శి పాకాల రాజేష్ కుమార్, జిల్లా అధ్యక్షుడు తుమ్మా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏకలవ్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు మాట్లాడుతూ ఏకలవ్యుని గొప్పతనానికి ఆయన విలువిద్య అభ్యసించిన తీరు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు భరత్, మోటా చక్రవర్తి, రాగాల రాము, కొండారెడ్డి అనీల్‌కుమార్, కంపా కిరణ్, మాదిగాని చిన్నపప్పు, కంపా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

పెంపుడు జంతువులతో జాగ్రత్తలు పాటించండి

● ఘనంగా ప్రపంచ జూనోసిస్ దినోత్సవం

చీరాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : ప్రతిఒక్కరూ పెంపుడు జంతువులతో జాగ్రత్తలు పాటించాలని పశువైద్యులు సజ్జా చిట్టిబాబు అన్నారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా ఉచితంగా రేబిస్ వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలో సుమారు 56 పెంపుడు కుక్కలకు ఆయా జంతువుల యజమానులు వ్యాక్సినేషన్ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ కచ్చితంగా పెంపుడు జంతువులకు వ్యాక్సిన్ అమలు చేయాలన్నారు. నిబంధనలు పాటించకుంటే వాటి నుంచి ఇతర జంతువులకు, మనుషులకు రోగాలు సంభవించే ప్రమాదముందని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

23న సీపీఐ జిల్లా మహాసభ

అద్దంకిటౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ బాపట్ల జిల్లా రెండవ మహాసభ ఈ నెల 23న అద్దంకిలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. ఆదివారం స్థానిక భూపేష్ భవన్(సిపిఐ నియోజకవర్గ కార్యాలయం)లో మహాసభలకు సంబంధించిన కరపత్రాన్ని ఆ విష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 23వ తేదీ మహాసభ ప్రదర్శన, భారీ బహిరంగసభ, ప్రతినిధుల మహాసభలు జరుగుతాయన్నారు. ఈ మహాసభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ , జల్లివిల్సన్, కేవీవీ.ప్రసాద్, సిహెచ్ కోటేశ్వరరావులు పాల్గొంటారని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి తుమ్మల పూర్ణచంద్రరావు, కోశాధికారి కేఎల్‌డి ప్రసాద్, కె. జనార్ధన్, వసంతరావు, మల్లికార్జునరావు, యాకోబు, దీలిప్ తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం ఎన్నిక



ఎన్నికైన బ్రాహ్మణ నిత్య అన్నదానసత్రం నూతన పాలకవర్గం

అద్దంకి, జూలై6 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రం కార్యవర్గం సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఆదిపూడి మోహనరావు, ఉపాధ్యక్షులుగా ముక్తినూతలపాటి వెంకటేశ్వరరావు, కంచిబొట్ల వెంకటసుబ్బయ్య, కార్యదర్శిగా పమిడిఘంటం చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా పుట్టంరాజు సాయికుమార్, కోశాధికారిగా ధేనువకొండ సుబ్బారావు, గౌరవ ఆత్మీయ అంతరింగిక న్యాయ ధర్మ కార్యనిర్వహక సేవా నిర్వాహణాధికారి గా పశ్చిమ బెంగాల్ రిటైర్డ్ ఐపీఎస్ డాక్టర్ బొప్పూడి నాగరమేష్, గౌరవ అధ్యక్షుడుగా కోట శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా దూర్భాకుల సుబ్రహ్మణ్యం, వంగర హరిశంకరావధాని, పుట్టంరాజు రామకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎంవీఐ కార్యాలయం ఏర్పాటుకు ప్రతిపాదనలు

అద్దంకి, జూలై6(ఆంధ్రజ్యోతి): అద్దంకిలో ఎంవీఐ కార్యాలయం ఏర్పాటు ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని జిల్లా రవాణాశాఖ అధికారి కృష్ణపరందామరెడ్డి అన్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం కృష్ణపరందామరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రవాణా శాఖ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా అత్యధికశాతం సేవలను ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వ కల్పించిందన్నారు. కొద్దిరకాల సేవలకు మాత్రమే కార్యాలయాలకు రావాల్సి ఉంటుందన్నారు. నాన్ ట్రాన్స్‌ఫోర్టు ఆర్‌సీ కార్డులు తప్పనిసరి కాదని, అవసరమయ్యే వాహనచోదకులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని పొందవచ్చన్నారు. కార్డులతో పనిలేకుండా వాహనాల పత్రాలను తనిఖీ అధికారులకు చూపితే సరిపోతాయన్నారు.

కుక్కకాటుతో బాలునికి గాయాలు

మార్టూరు, జూలై6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్రోణాదుల గ్రామంలో బాణావతు లక్ష్మీకుమార్ అనే 12 ఏళ్ల బాలుడిని ఇంటిలోనికి వెళ్లి వీధికుక్క కరిచి గాయపరిచింది. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకొంది. ఈ సమయంలో ఇంటిలో బాలుని తల్లిదండ్రులు లేరు. వాస్తవంగా బాలుని వయస్సు 12 సంవత్సరాలు ఉన్నప్పటికి మానసికంగా, శారీరకంగా బాలుడికి ఎదుగుదల లేదు. బాలుని చెంపపై కుక్క గాయపరచడంతో, తరువాత ఇంటికి వచ్చిన తల్లి దండ్రులు అ విషయాన్ని గమనించి 108 వాహనంలో కుమారుడ్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.తరువాత మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు తరలించారు.

టీడీపీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

మార్టూరు, జూలై6(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు టీడీపీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గాదె మదుసూదనరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మార్టూరులో ఇంటూరి ఫంక్షన్‌హాలులో వైసీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాబుష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమానికి మధుసూదనరెడ్డి ముఖ్య అతిథిగా హాజయర్యారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చకుండా టీడీపీ రాష్ట్ర ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో పఠాన్ కాలేషావలి, జంపని వీరయ్య, ఉప్పలపాటి చెంగలయ్య, తాటి వెంకటరావు, గడ్డం మస్తానవలి తదితర మండలంలోని పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 360 మందికి పరీక్షలు

మార్టూరు, జూలై6(ఆంధ్రజ్యోతి): మార్టూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర బైండ్ల కులస్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాటూరి మెడికల్ కాలేజీ హాస్పిటల్, చినకోండ్రుపాడు వారు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్యశిబిరాన్ని టీడీపీ నాయకులు తొండెపు ఆదినారాయణ, షేక్ రజాక్‌లు ప్రారంభించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలు మేరకు ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో 360 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వారందరికి తొలుత షుగర్, బీపీ పరీక్షలు చేశారు. దీంతో వారిలో 155 మందికి శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు నిర్ణయించారు. కార్యక్రమంలో నాయకులు కమ్మ శివనాగేశ్వరరావు, కాకోలు వెంకటేశ్వర్లు, రాష్ట్ర బైండ్ల కులస్తుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వల్లపుదాసు తిరుపతిరావు, ఉపాధ్యక్షులు సూరేపల్లి వెంకటశేషయ్య, మందపాటి అంజయ్య, నారాయణ, శ్రీనివాసరావు, నాగండ్ల రమేష్, సూరేపల్లి దిలీప్, గొర్రెపాటి నాగదుర్గయ్య, నాగండ్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలపై కొరవడిన పర్యవేక్షణ

● ఒకరిద్దరు మాత్రమే విధులకు హాజరు

● పలు పనులపై సచివాలయాలకు వచ్చి పడిగాపులు కాస్తున్న ప్రజలు

బల్లికురవ. జూలై 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయ ఉద్యోగులకు బదిలీలు జరుగుతాయని తెలిసి అక్కడ పనిచేసే ఉద్యోగులు బదిలీ ఉత్తర్వులు రాకముందే విధులకు డుమ్మా కొడుతున్నారు. తాము ఎలాగు బదిలీ అవుతామని చెబుతూ ప్రజలకు కూడా వారు పనులు సక్రమంగా చేయడం లేదు. ప్రతిరోజు పలు గ్రామాలలో ప్రజలు ఉద్యోగుల కోసం సచివాలయాల వద్ద పడి గాపులు కాస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కూడా కొరవడడంతో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా విధులకు వస్తున్నారని ఏ సమయంలో చూసిన ఒకరు ఇద్దరు మినహా మిగిలిన ఉద్యోగులు అందుబాటులో ఉండడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉద్యోగులు అందుబాటులో ఉండడం లేదని వేమవరం గ్రామ ప్రజలు ఎంపీడీవో కుసుమకుమారికి కూడా ఇటీవల ఫిర్యాదు చేయగా తాను జిల్లా కేంద్రంలో ఉన్నానని విచారణ చేస్తామని చెప్పడంతో ప్రజలు సచివాలయం వద్ద నుంచి వెనుదిరిగారు.

మండలంలోని 20 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటిలో సొంత మండల ఉద్యోగులకు తోడు ఐదేళ్లు పూర్తయిన ఉద్యోగులు అత్యధికంగా ఉన్నారు. వీరికి ప్రభుత్వం బదిలీలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. దీంతో ఉద్యోగులు పదిరోజుల నుంచి సచివాలయాల విధులకు సకాలంలో హాజరు కావడం లేదు.! పించన్లను పంపిణీ చేసి విధులకు కొందరు ఉదయం వచ్చి మరలా సాయంత్రం ఒకసారి వచ్చి ముఖం చూపించి వెళుతున్నారని ప్రజల సమస్యలపై వారు స్పందించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వేమవరం సచివాలయంలో ప్రతిరోజు ఒకరు ఇద్దరు మాత్రమే విధులకు వస్తున్నారని, మిగిలిన వారు ఉదయాన్నే వచ్చి సంతకాలు చేసి, ఫీల్డ్ విజిట్‌లు అంటూ అందుబాటులో ఉండడం లేదని ప్రజలు వాపోతున్నారు. కొందరు ఉద్యోగులు తాము ఎలాగైన బదిలీలో వెళుతున్నామని ఇంకా పనులు చేసేది ఏమీ లేదని కాలక్షేపం చేస్తున్నారని అధికారులు వెంటనే అన్ని సచివాయలను తనిఖీలు చేసి ఉద్యోగులు అందరు విధులకు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. అధిక సచివాలయాల్లో ఉద్యోగులు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత పది రోజుల నుండి సచివాలయాలు ఉద్యోగులు లేక బోసి పోతున్నాయని ప్రజలు అంటున్నారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ కూడా సక్రమంగా ఉండడం లేదని పేర్కొంటున్నారు.



వేమవరంలోని గ్రామసచివాలయం

బాబుజగ్జీవన్‌రాంకు ఘన నివాళి

చీరాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : దేశ రాజకీయాల్లో సైతం బాబూ జగ్జీవన్‌రాంకు ప్రత్యేక శైలి ఉందని యువనాయకులు గౌరీ అమర్నాథ్ పేర్కొన్నారు. ఆదివారం జగ్జీవన్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ముక్కోణం పార్క్ కూడలిలోని ఆయన విగ్రహానికి ఎంఆర్‌పీఎస్ నాయకులతో కలిసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయోద్యమంలో గాంధీజీ స్ఫూర్తితో నాటి బ్రిటీష్ పాలకులపై తిరుగుబాటు చేసినట్లు తెలిపారు. స్వాతంత్ర్య అనంతరం పార్లమెంటేరియన్‌గా సేవలందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, రావినూతల నాగేశ్వరరావు, దుడ్డు వందనం, రమేష్, సైమన్, శరత్, తేళ్ల రాంబాబు, అశోక్, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే వైసీపీ నేతల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

ప్రజలకు ఎల్లప్పుడు తోడుంటా

ప్రజాహితమైన సంక్షేమానికి ఎల్లప్పుడు తోడుంటానని యువ నాయకులు గౌరీ అమ ర్నాథ్ అన్నారు. ఆదివారం ఎంజీసీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి కల్పనపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజల జీవన విధానాలను మెరుగు పరిచేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పీ4 ద్వారా ప్రత్యేక విధానాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు స్థానిక శాసనసభ్యులు ఎంఎం కొండయ్య ప్రత్యేక ప్రణాళిక చేస్తున్నట్లు వివరించారు.



జగ్జీవన్‌రాం విగ్రహానికి నివాళి అర్పిస్తున్న గౌరీఅమరనాథ్

భరద్వాజ రచనలు స్ఫూర్తిదాయకం

చీరాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ప్రజాసమస్యలపై రచయత భరద్వాజ రచనలు స్ఫూర్తిదాయకమని, ప్రముఖ రచయిత డా.బీరం సుందరరావు అన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆదివారం రచయత జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డా.రావూరి భరద్వాజ జయంతిని నిర్వహించారు. సాహితి సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రచనలు గొప్పతనాన్ని చాటారు. నిర్వాహకులు సుందరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాగవీరభద్రాచారి, యలమందరెడ్డి, జగదీష్, ప్రభాకర్, రాజ్ వినయ్‌కుమార్, హరిహరరావు, రామారావు, వడలి రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సుందరరావును సత్కరిస్తున్న నేతలు

మోకాలి ఆపరేషన్‌కు ఎల్‌వోసీ మంజూరు

పంగులూరు, జూలై 6(ఆంధ్రజ్యోతి): మోకాలి శస్త్రచికిత్స కోసం పంగులూరు గ్రామానికి చెందిన వడ్డెంపూడికి శ్రీకాంత్‌కు రూ.1.25 లక్షల విలువైన ఎల్‌వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరైంది. గ్రామ టీడీపీ అధ్యక్షుడు బాచిన త్రివేణి, స్థానిక నేత చౌదరిబాబు ఆదివారం బాదితుడు శ్రీకాంత్‌కు ఆదివారం అందచేశారు. పంగులూరు గ్రామానికి చెందిన వడ్డెంపూడి శ్రీకాంత్‌కు ఇటీవల రోడ్డుప్రమాదంలో మోకాలికి గాయమైంది. వైద్యులు కాలికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా నిధులు మంజూరు చేయించారు.

నిలిచిన వందే భారత్

● వీధికుక్కను ఢీకొనడంతో ఘటన

● సుమారు 25 నిమిషాలు ఆలస్యంగా నడిచిన రైలు

చీరాల, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : చీరాల రైల్వే స్టేషన్ సమీపంలో వందేభారత్ రైలు అర్ధంతరంగా నిలిచింది. ఆదివారం సాయంత్రం విజయవాడ వైపు నుండి చెన్నై వైపు వెళుతున్న రైలు చీరాల రైల్వే స్టేషన్‌లో ఓ వీధి కుక్క రైలు కింద పడి మృతిచెందింది. అయితే కళేబరం ఇంజన్ కింది భాగంలోని సెన్సిటివ్ భాగం(ప్రెజర్ డ్రాప్)కి తగలడంతో స్టేషన్ శివారు ప్రాంతానికి వెళ్లే సరికి రైలు నిలిచిపోయింది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది 25 నిముషాలు శ్రమించి కళేబరాన్ని తొలగించి మరమ్మతులు చేపట్టారు. అనంతరం రైలు యథాతథంగా కొనసాగింది.



నిలిచిన వందేభారత్ రైలు

యువకుడికి గాయాలు

● ద్విచక్రవాహనం అదుపుతప్పి పడడంతో ఘటన

అద్దంకిటౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో బైక్ అదుపుతప్పి పడి యువకుడు గాయపడిన ఘటన ఆదివారం సాయంత్రం అద్దంకి-మేదరమెట్ల రోడ్డులోని ధేనువకొండకాలనీ బలరామకృష్ణపురం సమీపంలో చోటుచేసుకొంది. అద్దంకి వైపు నుంచి మేదరమెట్ల వైపు బైకుపై వెళుతున్న యువకుడు ధేనువకొండ పునరావాలసకాలనీ సమీపంలో క్రాస్ రోడ్డు దాటిన తరువాత అదుపు తప్పి పడిపోయాడు. యువకుడి కంటి వద్ద, తలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న 108 సిబ్బంది గాయపడిన వ్యక్తికి ప్రాథమిక చికిత్స అందించి, అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే యువకుడు అపస్మారక స్థితిలో ఉండడంతో ఎటువంటి వివరాలు తెలియరాలేదని వైద్యసిబ్బంది తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

చినగంజాం, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముస్లింలు మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీర్లపండుగను నిర్వహించారు. మండలంలోని చినగంజాం, కడవకుదురు గ్రామాల్లోని పీర్ల చావిడిలో పీర్లను పలు రకాల పూలతో విశేషంగా అలంకరించి గ్రామాల్లోని ప్రధాన వీధులలో ఊరేగించారు. చినగంజాం, కడవకుదురు గ్రామాల్లోని వీధుల్లో కనకతప్పెట్లు, మేళతాళాలతో ముస్లిం యువకులు నృత్యాలు చేస్తూ ఊరేగింపు కార్యక్రమాన్ని జరిపారు. స్థానిక పీర్ల చావిడి వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేసి నిప్పులో నడిచి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అల్లాకు దూప, నైవేద్యం సమర్పించి బెల్లం పానకాన్ని భక్తులకు పంపిణీ చేశారు. మొహర్రాన్ని పురస్కరించుకుని మసీదులను, పీర్ల చావిడిలను రంగు, రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

అద్దంకిటౌన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ప్రజలు అందరు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి పి.తిరుపతిరెడ్డి కోరారు. ఆదివారం సీఐటీయూ, ఏఐటీయూసీ, ఆధ్వర్యంలో స్థానిక బంగ్లారోడ్డులోని అంబేద్కర్ విగ్రహం నుండి ప్రధాన రహదారిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. వెంకటేశ్వర్లు, రఘుచంద్, రావులపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లకు.. కొర్రీలు

(5వ పేజీ తరువాయి)

చేశారు. ఇందుకు సంబంధించి రైతులకు రూ.17.09 కోట్లు చెల్లింపులు జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సంబంధిత అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి సమీక్షించాలని రైతులు కోరుతున్నారు.

రైతులపై భారం..

ప్రభుత్వం రూ.270 కోట్లు విడుదల చేసినా ప్రొక్యూర్‌మెంట్ వ్యవస్థలు స్పీడు పెంచడంలేదు. బర్లీ పొగాకు సాగు చేసి కొనుగోళ్లు జరగక రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం సాయం కోరింది. కేంద్రం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. దేశంలో ఎక్కడా ఎప్పుడూ లేనట్లుగా రాష్ట్ర ప్రభుత్వమే గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేసి పొగాకు కొనుగోళ్లు చేపట్టింది. మొత్తం 11 కేంద్రాలను ఏర్పాటు చేసి పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఏ తేదీన సరుకు తీసుకురావాలనే దానిపై అధికారులు షెడ్యూల్ ఇచ్చారు. అయితే సాంకేతిక కారణాలతో పొగాకు కొనుగోలు కేంద్రాల్లో వేగవంతంగా ప్రాసెసింగ్ జరగడం లేదు. 20 శాతం వరకు తేమని అనుమతిస్తామని అధికారులు చెప్పారు. అయితే ఏ రైతు పొగాకు తీసుకొచ్చినా తేమ శాతం అధికంగా ఉందని ధరలో కోత పెడుతున్నారు. హైక్వాలిటీకి క్వింటాల్ రూ.12 వేలు, మీడియం క్వాలిటీకి రూ.9 వేలు, లోగ్రేడ్ రకానికి రూ.6 వేలు చెల్లిస్తామని మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు. ఇప్పుడు రైతులు మీడియం క్వాలిటీలు తీసుకొస్తున్నా లోగ్రేడ్‌గా ముద్ర వేస్తున్నారు. కాగా పెదనందిపాడు పరిసర ప్రాంతాల్లో రైతులు దాదాపుగా 35 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుంటూరులోని సీడబ్ల్యూసీ గోడౌన్‌కు తీసుకురావడానికి వ్యయప్రయాసలు పడాల్సి వస్తున్నది. దీని వల్ల రవాణా చార్జీలు పెరిగిపోతున్నాయి. నిబంధనల ప్రకారం అన్‌లోడింగ్ చార్జీలు వసూలు చేయడానికి వీల్లేదు. అయినప్పటికీ బేలుకు రూ.130 రూ.160 వరకు వసూలు చేస్తున్నారు. ఇందుకు అధికారులు ఎలాంటి అడ్డు చెప్పడం లేదు. ఈ కారణంగానే ఈ వారంలో రైతులు ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుని రెండుసార్లు ప్రశ్నించారు. పొగాకు రైతులు అధిక సంఖ్యలో ఉన్న పెదనందిపాడులో కూడా మరో కేంద్రం ఏర్పాటు చేయాలని సాగుదారులు కోరుతున్నారు.

ఇప్పటి వరకు కొనుగోళ్లు ఇలా...

జిల్లా - సెంటర్	- బేళ్ల సంఖ్య	- కొనుగోళ్లు(టన్నుల్లో)	- చెల్లింపు
బాపట్ల - ఇంకొల్లు	- 1083	- 100.229	- రూ.98,58,150
" - పంగులూరు	- 613	- 52.31	- రూ.47,14,890
" - పర్చూరు	- 3863	- 368.11	- రూ.3,60,17,250
" - బీకేపాలెం	- 1295	- 136.22	- రూ.1,33,90,110
" - చీరాల	- 29012	- 281	- రూ.2,27,39,430
" - పర్చూరు	- 786	- 75.78	- రూ.68,86,590
గుంటూరు- గుంటూరు	- 2747	- 260.96	- రూ.2,15,54,064
" - పెదకాకాని	- 1515	- 132.88	- రూ.98,74,350
పల్నాడు - చిలకలూరిపేట	- 817	- 73.22	- రూ.59,05,620
" - యడ్లపాడు	- 2443	- 205.04	- రూ.1,68,50,070
ప్రకాశం - గుండ్లపల్లి	- 3303	- 266.7624	- రూ. 2,31,26,496

నల్లబర్లీ కొనుగోలు కేంద్రాలు పెంచాలి : రైతుసంఘం

పంగులూరు: రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నల్లబర్లీ కొనుగోలు కేంద్రాలు పెంచాలని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య కోరారు. ఆదివారం సాయంత్రం పంగులూరులో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో బర్లీ పొగాకు రైతుల అవసరాలకు తగినట్లుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు. కేంద్రాలు తక్కువగా ఉండడంతో కొనుగోళ్లు ఆలస్యంగా సాగుతోందన్నారు. రోజుకు రెండు వందల చెక్కులకు మించి కొనుగోలు చేయని పరిస్థితి కేంద్రాలలో నెలకుందన్నారు. ఇంత తక్కువగా కొనుగోళ్లు చేస్తే ఎన్ని రోజులకు కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని కృష్ణయ్య ప్రశ్నించారు. ఒక్కో కొనుగోలు కేంద్రంలో రోజుకు వెయ్యి చెక్కులు కొనుగోలు చేసేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. రైతులవద్ద నిల్వఉన్న చివరి ఆకువరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ప్రభుత్వం చెబుతుంటే కొనుగోలు కేంద్రాలలోని బయ్యర్లు నిబంధనల పేరుతో ఎక్కువ చెక్కులను వెనుకకు పంపుతున్నారన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా కొనుగోళ్లు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

పర్చూరు, జూలై 6 (ఆంధ్రజ్యోతి) : తొలి ఏకాదశి పర్వదినాన్ని మండలంలోని ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆయా వైష్ణవాలయాలు భక్తులతో కిక్కిరిసాయి. ఏటా పండుగులకు ప్రారంభం కూడా తొలి ఏకాదశి కావడం విశేషం. వేకువ జాము నుంచే భక్తులు పూజలు చేశారు. తొలిఏకాదశని పేలపిండి పండుగ అని పిలవడం విశేషం.

శాస్త్రోక్తంగా పూజలు

● పంగులూరు : తొలిఏకాదశి పర్వదినం సందర్భంగా రామకూరుకొండపై ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.. శ్రీబాల త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు ఆలయానికి వేలాదిగా భక్తులు తరలిరావడంతో కొండపై సందడి నెలకొంది. స్వామివారిని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరడంతో ఆలయప్రాంగణం కిక్కిరిసింది. ఆలయ అర్చకులు ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి పంచామృతాలతో రుద్రాభిషేకం, అమ్మ వారికి కుంకుమార్చన, ఆలయ గిరిప్రదక్షిణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు అర్చకస్వామి వెంకటేష్ బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు బొబ్బేపల్లి ఆంజనేయులు, రజనీ దంపతులు అల్పాహారం అందజేశారు. ఆలయకమిటీ దాతల సహకారంతో వేలాదిగా తరలి వచ్చిన భక్తులకు అన్న సంతర్పణ చేసింది. ఆలయ ఈవో సుబ్బారావు కమిటీ సహకారంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● యద్దనపూడి,(మార్టూరు) : తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం యద్దనపూడి మండలంలోని చింతపల్లిపాడు గ్రామంలో చెన్నకేశవస్వామి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు నారాయణం శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి విశేషసేవలు, ప్రాతఃకాలసుప్రభాత తోమాల సేవలు, మూలమూర్తి అర్చనలు తదితర సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు భగవద్గీత పారాయణం చేశారు.

● మార్టూరు : తొలి ఏకాదశి సందర్భంగా మార్టూరు గ్రామంలోని ఘట్టేశ్వరస్వామి దేవస్థానం, చెన్నకేశవస్వామి దేవస్థానం, పాండురంగస్వామి దేవస్థానాల్లో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పాండురంగస్వామి దేవస్థానంలో హరినామ సంకీర్తన భజన కార్యక్రమాన్ని 24 గంటలు భక్తులు చేశారు. కొంతమంది భక్తులు కోటప్పకొండకు వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు.

● చినగంజాం : మండల పరిధిలోని పలు గ్రామాల్లో తొలి ఏకాదశి పండగను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానం, కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరం, షిర్డీ సాయిబాబా ఆలయంలో, కడవకుదురు, చింతగుంపల్లె, గొనసపూడి, సంతరావూరు, పెదగంజాం, నీలాయపాలెం, రాజుబంగారుపాలెం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో స్వామి వార్లను విశేషంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వినియోగం చేశారు.

బీజేపీ నాయకుల పూజలు

మార్టూరు : తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం మండలంలోని బొల్లాపల్లి గ్రామంలో జగన్మాత ఈశ్వరిమాతను జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు కొండముది బంగారుబాబు కుటుంబసమేతంగా దర్శించుకొని, అమ్మ వారికి పూజలుచేసి, చీర, సారెను సమర్పించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షులు పూసపాటి సాంబశివరావు, పంగులూరు మండల నాయకులు చేబ్రోలు రవిచంద్ర, కోళ్లపూడి సురేష్ బాబుతదితరులు పాల్గొన్నారు.

● అద్దంకి : తొలిఏకాదశి సందర్భంగా అన్ని దేవాలయాలలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలెంలోని రంగనాయకస్వామి దేవాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయం, వేయిస్తంభాల గుడి, కమతేశ్వరాలయం, పాత శివాలయం, పాత దామావారిపాలెంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, శింగరకొండలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వార్లను దర్శించుకున్నారు. ఆదివారం కావడంతో భక్తులు కుటుంబసభ్యులతో దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.



రామకూరులో స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు



రామలింగేశ్వరస్వామి, చింతపల్లిపాడులోని చెన్నకేశవస్వామి, అద్దంకిలో రంగనాయక స్వామి, శింగరకొండ ఆంజనేయస్వామి